నేటి కందం- నేటికి అందం

హెచ్చిన ఉత్సాహముతో
మెచ్చగ నభిమానతతులు మించిన ధృతిలో
రెచ్చి మహోన్నత గతిలో
తెచ్చిరి క్రికెట్టు కప్పు "దివ్య నయనలు"న్

(దివ్య నయనల (అంధుల) మహిళల క్రికెట్ టీ ట్వంటీ లో భారత్ కప్పు గెలిచింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

చురక

పంచాయతీ ఎన్నికల్లో
పాత రిజర్వేషనే
రాష్ట్ర బీసి కోటా పెంపు
రాజకీయ శోషనే.
కేంద్రమడ్డుపడితే ఎట్లా
కాగలదు ఇంకా అమలు
ఏదో మేలు జరిగేనని
ఎందుకింకా దాని భ్రమలు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 25-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:87 పేజీలు:6 వెల: రూ.1/-


## కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుంది: సీఎం రేవంత్ రెడ్డి



కొడంగల్, నవంబర్ 24: ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే.. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొడంగల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలని తమ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. ప్రతి పేద తల్లి కళ్లల్లో ఆనందం చూడాలని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అదానీ, అంబానీలతో పోటి పడేలా సోలార్ ప్లాంట్స్ నిర్వహణను మహిళలకు అప్పగించామని వివరించారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని వివరించారు.

హైటెక్ సిటీ శిల్పారామంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు స్టాల్స్ సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ఆడబిడ్డలు తయారు చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు అమెజాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు మంచి చదువు అందించడం ఒక్కటే మార్గమని సూచించారు. మీ పిల్లలు గొప్పగా చదువుకుంటేనే మీ జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకే అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమం తీసుకువస్తున్నామన్నారు. బిడ్డల గురించి కన్నతల్లి ఆలోచించినట్లుగా? తమ ప్రభుత్వం ఆలోచించి వారి ఆకలి తీరుస్తోందని తెలిపారు.


ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, వెటర్నరీ, అగ్రి, పారామెడికల్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు , ఏటీసీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలలు, సైనిక్ స్కూల్ తీసుకొచ్చామని వివరించారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం కొడంగల్‌కు వెళ్లాలనేలా ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. 16 నెలల్లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్‌ను మార్చాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇస్తున్నారని చెప్పారు.

మూడేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేసి కొడంగల్ భూములను కృష్ణా జలాలతో తడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు . లగచర్ల పారిశ్రామిక వాడను అంతర్జాతీయ పారిశ్రామిక వాడగా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. త్వరలోనే కొడంగల్ ప్రజలు రైలు కూతను కూడా వినబోతున్నారన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతుందన్నారు. మరో తొమ్మిది నెలల్లో రైల్వే లైన్ ఏర్పాటు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు.

కొడంగల్ నియోజ కవర్గంలో సిమెంట్ పరిశ్రమలు సైతం ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. అభివృద్ధిలో కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఒక మోడల్‌గా మారుస్తామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోండంటూ ప్రజలకు సూచించారు. ఆడబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న సారె ఇందిరమ్మ చీరలని.. ఇవి ప్రతి ఆడబిడ్డకు చీర చేరేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆడబిడ్డలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## లోయలో పడిన బస్సు ..ఐదుగురు మృతి



డెహ్రాడూన్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉత్తరాఖండ్ రాష్ట్రం తెహ్రా జిల్లాలో బస్సు లోయలో పడింది. నరేంద్ర నగర్ ప్రాంతంలో బస్సు లోయలో పడడంతో ఐదుగురు మృతి చెందగా 28 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వివిధ ఆస్పత్రులకు తరలించారు. గుజరాత్, ఢిల్లీకి చెందిన యాత్రికులు కుంజాపురి దేవాలయానికి వెళ్తుండగా బస్సులో 70 అడుగు లోతు గల లోయలో పడింది. గాయపడిన వారిలో 23 మంది పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు సర్కార్ గుడ్ న్యూస్

### రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు

హైదరాబాద్, నవంబర్ 24:రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు.

ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెల్లెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు.

మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

## భర్తను చంపిన భార్యలు

### -డీజీల్ పోసి నిప్పంటించి దారుణంగా హత్య

అమరావతి, నవంబర్ 24:మానవత్యం మంటగలుస్తోంది. మానవ సంబంధాలు దెబ్బతిం టున్నాయి. క్షణికావేశం మనసుల్ని రాక్షసులుగా మారుస్తోంది. కట్టుకున్న భర్తను ఇద్దరు భార్యలు డీజిల్ పోసి నిప్పటించారు. ఈ ఘటనలో భర్త అక్కడికక్కడే ప్రాణా లు వదిలాడు. ఎస్సై కే.సందీప్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమ్ నగర్ లో సోమవారం జరిగింది.గ్రామానికి చెందిన మాలవత్ మోహన్ (39)కు ఇద్దరు భార్యలు, ఐదుగురు కుమార్తెలు. మృతుడు మొదటి భార్య సంగీత ది మానాల, రెండో భార్య కవిత ది తాళ్లపల్లి గ్రామం. మొదటి భార్యకు ముగ్గురు, రెండో భార్యకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా మృతుడు ఇంటి వద్ద వ్యవసాయం పనులు చేసుకుంటూనే, వివాహాలకు, శుభకార్యాలకు బ్యాండ్ కొట్టేందుకు తాత్కాలికంగా వెళ్తాడు. మృతుడు మోహన్ కు ఇద్దరు భార్యలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో సోమవారం సైతం భర్త, ఇరువురు భార్యలతో గొడవ జరిగినట్టు సమాచారం.

## అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్: తలసాని

హైదరాబాద్, నవంబర్ 24:అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్ నగర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఇవాళ (సోమవారం) సనత్‌నగర్‌లోని బీకే గూడలో గల సీనియర్ సిటీజన్స్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పైబడిన 34 మంది, 70 సంవత్సరాలు పైబడిన 32 మంది సీనియర్ సిటీజన్స్‌ను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తమ వయసు సైతం లెక్క పెట్టకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా సీనియర్ సిటీజన్స్ నిలుస్తున్నారని ప్రశంసించారు.

2014లో తాను సనత్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సౌకర్యార్థం ఓ కార్యాలయం నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఉండాల్సిన సమయంలో సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఒక కమిటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని, ఇక ముందు కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్.

సనత్‌నగర్ నియోజకవర్గంలో 2014 తర్వాతనే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపెట్టామని చెప్పుకొచ్చారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి హయాంలో కూడా సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా అభివృద్ధి పనులు జరగలేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షులు పార్థసారధి, మానిక్ రావ్ పాటీల్, సభ్యులు అనంతరెడ్డి, కృష్ణ దేవ్‌గౌడ్, సాయి, నాయకులు కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్న

### -మహిళ సంఘాలకు వ్యాపార అభివృద్ధికి వడ్డీలేని రుణాలు..
### -పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసూరి అనసూయ సీతక్క..

భూపాలపల్లి ఆంధ్రప్రభ : మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ మంత్రి (ధనసరి అనసూయ) సీతక్క అన్నారు. వ్యాపార రంగంలో రాణించేలా వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధృడ సంకల్పంతో మహిళలకు అనేక కార్యక్ర మాలను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయా ణం అద్దె బస్సులకు యజమా నులను చేయడం, వడ్ల కొనుగో లు కేంద్రాల నిర్వహణ లాంటి ఎన్నో కార్యక్రమాలను వారికి ఇ స్తున్నట్లు తెలిపారు. అనం తరం ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోంద న్నారు. ఇందిరా గాంధీ చేసిన అభివృద్ధి బాటలో కాంగ్రెస్ ప్రభు త్వం నడుస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్య మని పేర్కొన్నారు. దేశ ప్రగతి, పేదల అభ్యున్నతి కోసం ప్రాణా లర్పించిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని ఆయన కొనియాడారు.

ఆమె ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా దేశ సమగ్రత, సమైక్యత కోసం కఠిన నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించారు. ఇందిరమ్మ పాలనే ఆదర్శంగా పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట లో.. మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జీఎస్సార్ జగ్గయ్యపేట గ్రామంలో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 20లక్షలతో రామగుండాలపల్లి రోడ్డులో కొత్తగా నిర్మించిన పంట పొలాలకు వెళ్లే ఆయకట్టు రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన స్మశాన వాటికకు వెళ్ళే రోడ్డు ప్రారంభిం చారు. ఇటీవల కరెంట్ షాక్ కు గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త తనుగుల మల్లయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు.

కొత్తపలిగొరి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లా డుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు.

## బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత



ముంబయి నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. ముంబయిలోని తన నివాసంలో ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ధర్మేంద్ర పూర్తిపేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్.1935 డిసెంబర్ 8న పంజాబ్ లో జన్మించారు. 300కు పైగా చిత్రాల్లో నటించారు. షోలే, ఆయీ మిలన్ కీ బేలా, ఫూల్ ఔర్ పత్తర్, జీవన్ మృత్యు, మేరా గావ్- మేరా దేశ్, రాజా జానీలో ప్యార్ కియా తో డర్నా క్యా, సీతా ఔర్ గీతాలో యాదోం కీ బారాత్, దోస్త్, చరస్, ధర్మవీర్ లో నటించారు. 1954 లో ప్రకాశ్ కౌర్ ను వివాహం చేసుకున్నారు. 1980 లో హేమామాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్రకు సన్నీ, బాబీ, ఈషా సహా ఆరుగురు సంతానం ఉన్నారు. 2004 లో బికనీర్ నుంచి బిజెపి ఎంపిగా గెలిచారు. యాక్షన్ కింగ్, హీమ్యాన్ గా ధర్మేందర్ కు గుర్తింపు పొందారు. షోలే, చుప్కే చుప్కే సినిమాలతో టాప్ హీరోగా రాణించారు. ధర్మేంద్ర సినీ కెరీర్ ను 'షోలే' చిత్రం మలుపు తిప్పింది. 2012 లో ఫిలింఫేర్ జీవిత సాఫల్య, పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ధర్మేంద్ర ఆఖరి చిత్రం ఇక్కీస్ త్వరలో విడుదల కానుంది.

## ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రమాదం.. ముగ్గురు మృతి

సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సోమవారం ప్రమాదం జరిగింది. భవనం మరమ్మతులు చేస్తుండగా.. సెంట్రింగ్ కుప్ప కూలింది. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారు. ఈఎస్ఐలోని అత్యవసర విభాగంలో ఆధునీకరణ (రెనోవేషన్) పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో.. వాటిని తొలగించి కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు సైతం ఘటన స్థలానికి చేరుకుని.. వివరాలు సేకరించారు.

## పాక్ పారా మిలిటరీ ప్రధాన కార్యాలయంపై ఆత్మాహుతి దాడి



న్యూ డిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పాకిస్థాన్ లో ముష్కరులు రెచ్చిపోయారు. పెషావర్ లోని పాక్ పారామిలిటరీ ప్రధాన కార్యాలయం పై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు కమాండోలు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.సోమవారం తెల్లవారుజామున పెషావర్‌లోని ఫ్రంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు దాడి చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ఆ కార్యాలయాన్ని ముట్టడించిన ముష్కరులు వరుస దాడులు చేశారు. దీంతో అప్రమత్తమైన పారామిలిటరీ సిబ్బంది వారిపై కాల్పులు జరిపారు. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు కమాండోలు మరణించారు. పలువురు గాయపడ్డారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రధాన కార్యాలయంలోపల కొంతమంది ఉగ్రవాదులు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో భద్రతా బలగాలు, స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి.

## ఔటర్ రింగ్ రోడ్డు 95 శాతం పూర్తి

హైదరాబాద్, నవంబర్ 24: హుజూర్ నగర్ పట్టణంలో వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్య దృష్టిలో ఉంచుకొని 2013లో ఔటర్ రింగ్ రోడ్డు పనులకు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. అప్పట్లోనే 60 శాతం రోడ్డు పూర్తయిన 2014 అధికారంలోకి వచ్చిన బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో పనులు జరగకుండా నిర్లక్ష్యం చేసినారు. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రింగ్ రోడ్డు పనులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష చేసి మెరుగైన రవాణా సౌకర్యం ప్రజలకు కల్పించాలని ఉద్దేశంతో మరల రూ.5 కోట్లు నిధులు వెంటనే మంజూరు చేసి రింగ్ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించిన నేపద్యంలో రింగ్ రోడ్డు పనులు 95 శాతం పూర్తి చేసారు.సోమవారం స్తానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు రింగ్ రోడ్డు పనులను పరిశీలన చేసి త్వరలో రింగ్ రోడ్డు ప్రజా వినియోగంలోకి వస్తుందని, కేవలం జంక్షన్ రోడ్ల పనులు మిగిలి ఉన్నాయన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గ చుట్టుపక్కల ఉన్న వివిధ ఫ్యాక్టరీల భారీ వాహనాలు కోదాడ, మిర్యాలగూడ నుంచి వచ్చే వాహనాలు ఈ ఔటర్ రింగు రోడ్డు ద్వారానే వెళ్తాయని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, దశాబ్దాల ప్రజల కోరిక త్వరలోనే నెరవేరబోతుందని వారు తెలిపారు.

# ఏఐ యుగంలోనూ మహిళల పట్ల హింస కొనసాగవలసిందేనా !

## (25 నవంబర్ "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" సందర్భంగా)

ప్రకృతి సగం ఆమె. మానవ జనన కారణమూర్తి ఆమె. ఇంటికి దీపం ఆమె మనస్సు. ఆమె చేతి వంటే అమృతం. మహిమాన్విత శక్తి రూపం ఆమె. చదువుల తల్లి సరస్వతి, సంపదలు చేకూర్చే తల్లి లక్ష్మి, ధైర్యానికి చిరునామా దుర్గ మాత. ఈ మహాశక్తి స్వరూపాలు అతివలే. అబలలు కాదు, అష్టలక్ష్ములు మహిళామణులే. ఆమె లేనిదే పూట గడవదు, ముద్ద దిగదు. అయినా ఆమె అంటే పురుషాధిక్య సమాజానికి చిన్న చూపు. నేడు ఆమె ఓ ఆట వస్తువు. ఆమెను చూస్తే మృగాళ్లలో రాక్షసుడు నిద్ర లేస్తాడు. ఆమె ద్వితీయ శ్రేణి పౌరురాలు. ఆవిడంటేనే పురుష పుంగవులకు చులకన. ఆమెపై లైంగిక దాడులు, అత్యాచారాలు, మానభంగాలు, అక్రమ రవాణాలు, భ్రూణహత్యలు, గృహ హింసలు, వేధింపులు నిత్యకృత్య దుశ్శాసన పర్వాలు గుర్తుకు వస్తాయి. కార్యసిద్ధిలో లేని మగతనం మగువను చూడగానే మృగతనమై రెచ్చిపోతుంది. బాల్య వివాహ బంధనాలు, బాలకార్మిక చేష్టల చట్రాలు వాస్తవంలోకి వస్తాయి.

ఏ దేశం చూసినా ఏమున్నదా గర్వకారణం !

మనతో చెల్లి, తల్లి, కూతురు ఉందని మరిచి ఆవిడపై అత్యాచారాలకు ఒడిగడుతున్న డిజిటల్ మృగ సమాజంలో లెక్కలేనన్ని దురాగతాలు జరుగుతున్నాయి. ఏరులై పారుతున్న మహిళల కన్నీళ్లను చూసి పౌర సమాజంలో ఇసుమంతైనా మానవత్వం కనిపించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా 35 శాతం మహిళలు తమ జీవితకాలంలో ఏదో ఒక రకమైన లైంగిక వేధింపులకు గురికావడం, వీరిలో 40 శాతం అబలలు వేధింపుల నుంచి సహాయం కోరడం, 10 శాతం వరకు మాత్రమే న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కడం జరుగుతున్నది. మహిళపై అత్యాచారం జరిగినపుడు పౌర సమాజం ఉద్యమించడం, రెండు రోజులకే చల్లబడడం, పాత వేతలే తిరిగి జరగడం అనాదిగా జరుగుతోంది. ప్రతి రోజు అదో ఒక మూలన మానభంగ మహిళ మౌన రోధన గొంతు దాటడం లేదు. విని స్పందించడానికి బదులు ఎగతాళి, అవమానం చేయడమనే దురలవాటు మొలుస్తున్నది. ఐరాస అంచనాల ప్రకారం మానవ అక్రమరవాణా చట్రంలో 71 శాతం మంది మహిళలే ఉంటున్నారు. కేవలం 52 శాతం గృహిణులు మాత్రమే కొంత స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రపంచంలో అధిక రేపు కేసులు నమోదవుతున్న దేశాల జాబితాలో దక్షిణ ఆఫ్రికా, బోట్స్వానా, స్వీడెన్, గ్రనెడా, యూఎస్‌లు ముందు వరసలో ఉన్నాయి. అమెరికాలో 9 శాతం రెపిస్టులపై విచారణలు జరుగగా, అందులో 3 శాతం వరకు మాత్రమే శిక్షలు పడడం, 97 శాతం రేపిస్టులు స్వేచ్ఛగా బయట పడడం గమనిస్తున్నాం. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులు జరిగినా వాటిని బయట పెట్టడానికి స్త్రీ సమాజం వెనుకంజ వేయడంతో మగ మహా రాక్షసుల ఆగడాలకు అంతం కనుపించడం లేదు.

భారత్‌లో మహిళలపై అత్యాచారాలు:

ప్రపంచవ్యాప్త మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసాత్మక ధారుణులను గమనించిన ఐరాస 2000 నుంచి ప్రతి ఏట 25 నవంబర్ రోజున "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం-2025 ఇతివృత్తంగా "మహిళలు, బాలికలపై డిజిటల్ హింస అంతానికి అందరం ఏకమవుదాం" అనబడే అంశాన్ని తీసుకోవడం జరిగింది. మహిళా హింసకు "నో" చెప్పాలంటూ యునెస్కో 25 నవంబర్ నుంచి 10 డిసెంబర్ వరకు 16 రోజుల పాటు లింగ-ఆధార్ హింసలకు వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహిస్తున్నది. ప్రపంచ మానభంగాల రేటు ఆధార 120 దేశాల జాబితాలో భారత్‌కు 95వ స్థానం దక్కడం విచారకరం. భారత్‌లో తరుచుగా నిర్భయ, హత్రాస్ ఘటనలు ఎన్ని జరిగిన తాత్కాలిక చర్యలకు మాత్రమే ప్రభుత్వాలు పూనుకోవడం దురదృష్టకరం, ఆక్షేపణీయం. ఇండియాలో ప్రతి లక్ష మందిలో 4.2 శాతం రేపులు జరుగుతున్నాయని, రేపు కేసులు అధికంగా (20 నుంచి 10 శాతం) చంఢీఘడ్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, హర్యానా, అస్సాం, హిమాచల్ ప్రాంతాల్లో నమోదు అవుతున్నాయి. రేప్ కేసులు అత్యల్పంగా (1 నుంచి 1.6 శాతం వరకు) గుజరాత్, కర్నాటక, తమిళనాడు, నాగాలాండ్ రాష్ట్రాల్లో నమోదు కావడం గమనించారు. తెలంగాణలో 4.7 శాతం, ఏపీలో 4.2 శాతం రేపు కేసులు బయట పడుతున్నాయి. గత దశాబ్ద కాలంగా రేపు కేసులు రెట్టింపు కావడాన్ని ప్రమాద హెచ్చరికగా భావించాలి.

బాలికల అక్రమ రవాణా దుర్మార్గాలు:

మానవ హక్కుల సంస్థ గణాంకాల ప్రకారం భారత్‌లో ప్రతి ఏట 7,200 మైనర్ బాలికలు (లక్షకు 1.6 శాతం) మానభంగాలకు గురి కావడం భరతజాతికే సిగ్గు చేటు. బాలికల అక్రమ రవాణా, ఆ చిన్నారులను వ్యభిచార నరక కూపాల్లో బంధించడం యధ్ధేచ్ఛగా కొనసాగుతోంది. దేశ జనాగ్రహావేశాలను చలి చూసిన ఢిల్లీ నిర్భయ కేసులో నిందితులకు శిక్ష పడడానికి 6 ఏండ్ల కాలం పట్టింది. అధిక శాతం మానభంగాలు 15 - 24 ఏండ్ల యువతుల్లోనే కనిపించడం, 70 శాతం మానభంగ నిందితులు తెలిసిన వారే కావడం సోచనీయం. మానభంగాల తర్వాత అతివలను హత్య చేయడం కూడా సాధారణంగా జరుగుతున్న వేళ, ఈ దుశ్చర్యలకు చరమగీతం పాడడానికి ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థలు, పోలీసు యంత్రాంగాలు, పౌర సమాజం సమన్వయంతో కృషి చేసి మానవ మృగాలకు చుక్కలు చూపించడం, ఉరి తీసి నరకానికి పంపడం వెంట వెంటనే జరగాలి.

విద్యాలయాల్లో రేపటి యువతకు విలువలతో కూడిన విద్యను బోధించాలి. యూనివర్సిటీ డిగ్రీల కన్న మానవీయ విలువలే మిన్నయని తెలియజేయాలి. భారత మాత ముద్దు బిడ్డలుగా అమ్మాయిలను రక్షించాలి. మహిళకు విద్య అనే ఆయుధమిచ్చి సబలగా శక్తివంతం చేయాలి. మానభంగాలు లేని ప్రపంచాన్ని చూడడానికి అందరం విలువలతో కూడి క్రమశిక్షణతో జీవించాలి. ఈ మహాయజ్ఞంలో మనందరం భాగస్వాములమై ప్రతి మహిళలో భరతమాతను దర్శిస్తూ ముందుకు సాగుదాం. భారతీయ వనిత కన్నీటి వరదల కట్టడికి ఆనకట్టలు కడదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆధ్యాత్మిక సంస్థలు దేశ నిర్మాణానికి కీలక సహకారం అందించగలవు: రాష్ట్రపతి




న్యూఢిల్లీ, నవంబర్ 24:శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈరోజు (2025 నవంబర్ 22) ఆంధ్రప్రదేశ్ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి మన సాధువులు, ఋషులు వారి చర్యలు, మాటల ద్వారా సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఈ మహాత్ములు సమాజ సంక్షేమం కోసం అనేక పనులు చేశారని.. అటువంటి గొప్ప వ్యక్తులలో శ్రీ సత్యసాయి బాబా ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన ఎల్లప్పుడూ సమాజ సంక్షేమం కోసం పని చేశారని అన్నారు. 'మానవ సేవయే మాధవ సేవ' అనే నమ్మకాన్ని శ్రీ సత్యసాయి బాబా ప్రధానంగా తెలియజేస్తూ.. ఈ ఆదర్శాన్ని అనుసరించమని భక్తులకు సూచించారని తెలిపారు. ఈ విధంగా ఆయన ఆధ్యాత్మికతను ప్రజా సంక్షేమం వైపు మళ్లించారని వ్యాఖ్యానించారు. ఆయన ఆధ్యాత్మికతను నిస్వార్థ సేవ, వ్యక్తిగత పరివర్తనతో మేళవించారన్న ఆమె.. కోట్లాది మందిని సేవా మార్గాన్ని అనుసరించేతి ఆయన ప్రేరేపించారని అన్నారు.

ఆదర్శాలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు శ్రీ సత్యసాయి బాబా అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాలను చేవట్టారని రాష్ట్రపతి అన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యత గల ఉచిత విద్యను శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అందిస్తోందని పేర్కొన్నారు. ఇది విద్యా నైపుణ్యాన్ని వ్యక్తిగత వికాసంతో మిళితం చేస్తుందని అన్నారు. విద్యతో పాటు నాణ్యతతో కూడిన ఉచిత వైద్య సంరక్షణ ద్వారా కూడా సత్యసాయి బాబా లక్ష్యం ముందుకు సాగుతోందని ఉద్ఘాటించారు. ఈ ప్రాంతం లోని వేలాది కరువు పీడిత గ్రామాలకు తాగునీటిని అందించడం కూడా ఆయన దార్శనికత అందించిన ఫలితమేనని ఆమె పేర్కొన్నారు

సత్యసాయి బాబా సందేశాలైన 'అందరినీ ప్రేమించు.. అందరికీ సేవ చేయి', 'ఎల్లప్పుడూ సహాయం చేయి.. ఎప్పుడూ బాధ పెట్టకు' అనేవి శాశ్వతమైనవి, సార్వత్రికమైనవని రాష్ట్రపతి అన్నారు. 'ప్రపంచం మన పాఠశాల.. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవ విలువలు మన పాఠ్యాంశాలు' అని ఆయన నమ్మేవారని పేర్కొన్నారు. ఆయన బోధించిన మానవ విలువలు అన్ని సంస్కృతులకు, అన్ని కాలాలకు సరిపోతాయని అన్నారు.

'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తికి అనుగుణంగా దేశ నిర్మాణం అనేది అన్ని సంస్థల కర్తవ్యం అని రాష్ట్రపతి అన్నారు. ఈ విషయంలో ఆధ్యాత్మిక సంస్థలు ముఖ్యమైన సహకారాన్ని అందించగలని తెలిపారు. ప్రజల జీవితాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని.. వీటి ద్వారా ప్రజలు ప్రతిభ, సామర్థ్యాలను దేశాభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకునే వీలు ఉంటుందని అన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అన్ని ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో సహా ప్రైవేటు రంగం, ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. 2047 నాటికి భారతను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యాన్ని సాధించటంలో ఇది సహాయపడుతుందని రాష్ట్రపతి అన్నారు.

# పార్టీ పరంగా రిజర్వేషన్లు ఎలా ఇస్తారు..

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 24: గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ పరంగా రిజర్వేషన్లు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టతనివ్వాలని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు.

సోమవారం జిల్లా కేంద్రంలోని సత్యయాదవ్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు, వార్డుల జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడంలో ఎలాంటి పారదర్శకత లేదని ఆమె విమర్శించారు.

రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా శూన్యమైపోయాయని ఎంపీ ఆరోపించారు.

కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు తమ నియోజకవర్గాలను ఎలా ప్రోత్సహించుకున్నారో అదే తరహాలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం కొడంగల్‌కే అభివృద్ధి పరిమితం చేయడం సరైంది కాదన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ఎన్నికలను ఆలస్యం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న మూడు వేల కోట్ల నిధుల విడుదల కోసం హడావుడిగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని ఆమె విమర్శించారు.

రెండేళ్లుగా ఇవ్వని ఇందిరమ్మ చీరలను ఎన్నికల ముందు మాత్రమే పంపిణీ చేయడం మహిళలను మరోసారి మోసం చేసే చర్యేనని అరుణ మండిపడ్డారు. ప్రభుత్వం చేనేత చీరలు కాకుండా పవర్ లూమ్స్ చీరలను పంపిణీ చేస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పార్టీ కార్యకర్తలకే కాకుండా అర్హులైన నిరుపేదలకు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిధుల్లో ప్రధాని ఆవాస్ యోజన నిధులు కూడా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. మండలాల విభజనలో సమాన జనాభా ప్రమాణాలను పాటించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అరుణ స్పష్టం చేశారు.

అదేవిధంగా నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితి అత్యంత దారుణంగా మారిపోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, సీనియర్ నాయకులు నామాజీ నాగు రావు, రతంగ్ పాండు రెడ్డి, పగుడాకుల శ్రీనివాస్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సేవను జీవితంలో భాగంగా మార్చే విద్యను శ్రీ సత్య సాయిబాబా ఆశించారు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 24:ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఈ రోజు జరిగిన శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవ వేడుకకు ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, సేవ అనేది ఒక బాధ్యత కాకుండా, జీవితంలో ఒక భాగంగా ఉండే విద్యా వ్యవస్థను శ్రీ సత్యసాయిబాబా ఆశించారని, అది నిస్వార్థత, నిజాయితీ, ఉన్నత విలువలకు కట్టుబడిన నాయకులను అందిస్తుందని పేర్కొన్నారు.

శ్రీ సత్యసాయిబాబా స్థాపించిన విశ్వవిద్యాలయం చిహ్నంగా ఉన్న సర్వధర్మ స్తూపం శాంతి, సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తుందని ఉపరాష్ట్రపతి ప్రముఖంగా పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, విజ్ఞానం అందిస్తూ ఈ విద్యా సంస్థ అన్ని మతాలు, సంప్రదాయాలకు గౌరవం ఇస్తోందని ఆయన ప్రశంసించారు.

దేశంలో మార్పుదాయక వృద్ధి గురించి మాట్లాడుతూ, భారత్ అపూర్వమైన పురోగతి అంచున ఉందని, ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా, సుస్థిర అభివృద్ధికి, శాంతికి మార్గదర్శిగా ఆవిర్భవిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలులోకి వచ్చిన విస్తృతమైన సంస్కరణలను ఆయన ప్రస్తావించారు. ముఖ్యంగా జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 ద్వారా ఉన్నత విద్యా వ్యవస్థ మరింత బలపడిందని అన్నారు. సమగ్ర బోధనా వర్గం అభివృద్ధి, గణనీయమైన మౌలిక సదుపాయాలపై గణనీయమైన పెట్టుబడులు, డిజిటల్ సాధనాల వినియోగం, మెరుగైన అభ్యసన ఫలితాలు ఈ విధానం ద్వారా సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలు వేగంగా బహుళ విషయ పరిశోధన, ప్రతిభ దిశగా ముందుకు సాగుతున్నాయని, తద్వారా విజ్ఞాన సృష్టి, సాంకేతిక పురోగతి, సమ్మిళిత విద్యావరమైన అభివృద్ధిలో భారతదేశాన్ని ప్రపంచ నాయకత్వ స్థాయిలో నిలబెడుతున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. పరిశోధనలో పెట్టుబడిని పెంచాల్సిన అవసరాన్ని కూడా ఆయన స్పష్టం చేశారు.

భవిష్యత్ తరాలు కృత్రిమ మేధ, బిగ్ డేటా, బ్లాక్ చెయిన్, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు తప్పనిసరిగా అలవాటు పడాలని, అదే సమయంలో జాతీయ విలువలకు కట్టుబడి ఉండాలని శ్రీ రాధాకృష్ణన్ ఉద్బోధించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సంస్కరణలు అమలు జరుగుతున్నాయని, ప్రపంచం భారతదేశం మాట వింటోందని ఉపరాష్ట్రపతి అన్నారు. కొవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రధానమంత్రి పిలుపును గుర్తు చేస్తూ, భారత్ కేవలం తన కోసం మాత్రమే కాకుండా, మానవాళి శ్రేయస్సు కోసం వ్యాక్సిన్‌ను తయారు చేసిందని ఆయన పేర్కొన్నారు. దీనిని మన దేశం సాధించిన గొప్ప విజయాలలో ఒకటిగా ఆయన అభివర్ణించారు.

మానవీయ కోణంతోనే ఆర్థిక శక్తికి విలువ ఉంటుందని, అనేక దేశాలకు ఉచితంగా టీకాలను అందించడం ద్వారా భారతదేశం దీనిని నిరూపించిందని ఆయన అన్నారు. భారత్ ప్రపంచంలో నంబర్ వన్ ఆర్థిక శక్తిగా మారినప్పుడు, ప్రపంచ సంక్షేమానికి మరింత ఎక్కువ కృషి చేస్తుందని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు, "డ్రగ్స్ వద్దు" అనే సందేశాన్ని మరోసారి ఉద్ఘాటించారు. విద్యార్థులు భారత ఆధ్యాత్మిక విలువలు, మానవత్వం, క్రమశిక్షణ అంకిత భావంతో కూడిన జీవన విధానానికి రాయబారులుగా ఉండాలని ఆయన కోరారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ ఏ 2047' దార్శనికతతో తమను తాము సమన్వయం చేసుకుని, దేశ పురోగతికి అర్థవంతమైన సహకారం అందించాలని ఉపరాష్ట్రపతి పట్టభద్రులను కోరారు."మానవతా విలువలను పెంపొందించుకోవడమే నిజమైన విద్య" అని శ్రీ సత్యసాయి బాబా ఇచ్చిన సందేశాన్ని ఉటంకిస్తూ తన ప్రసంగాన్ని ముగించిన ఉపరాష్ట్రపతి, ఈ అర్థవంతమైన సందేశాన్ని పట్టాలు తీసుకుంటున్న విద్యార్థులు తమ జీవితాలకు మార్గనిర్దేశంగా తీసుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్‌టీజీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేశ్, ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్ ఛాన్సలర్ శ్రీ కె. చక్రవర్తి, ఇతర ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

### -కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు,నవంబర్ 24: పీజీఆర్ఎస్ అర్జీలను సీరియస్‌గా తీసుకోవాలని కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులందరూ పీజీఆర్ఎస్‌లో ప్రతి రోజు లాగిన్ అయి ఎట్ టూ వ్యూ అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వచ్చిన వెంటనే అర్జీలను చూస్తే, రెవెన్యూ అర్జీల లాంటి వాటికి నోటీసులు ఇచ్చే టైమ్ ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్, ఎండార్స్మెంట్ లు సరిగా ఇవ్వకపోవడం, రీ ఓపెన్ అయిన కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఉన్న కింది స్థాయి అధికారులకు మెమోలు జారీ చేసి, సంబంధిత మెమోలను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. 10 రోజులకు ఒకసారి వివిధ శాఖల హెచ్ఓడీలు వారి కింది స్థాయి సిబ్బందితో పీజీఆర్ఎస్ అంశంపై ట్రైనింగ్‌లు నిర్వహించాలని, ఆ ఫోటోలను గ్రూప్‌లో కూడా పోస్ట్ చేయాలన్నారు. అదే విధంగా ప్రతి రోజు కొంతమంది అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. అర్జీలు గడువు లోపు పరిష్కరించాలని, రీ ఓపెన్ కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఎన్టీఆర్ వైద్యసేవకి సంబంధించి అన్ని ఆసుపత్రులలో జిల్లాలో ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలన్నారు. టోల్ ఫ్రీ ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, మున్సి పాల్టీ లలో సమస్యలకు సంబంధించి పత్రికల్లో ఎక్కువగా వార్తలు వస్తున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్డీవోలు తనిఖీ చేసి మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# విద్యార్థుల ఆందోళన..

### -ఇన్ చార్జి ప్రిన్సిపాల్ బూతులు తిడుతున్నాడని విద్యార్థుల ఆరోపణ

జగిత్యాల, నవంబర్ 24: : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు పాఠశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ రవి మహేంద్ర తమను బూతులు తిడుతూ, కొడుతూన్నాడని సోమవారం పాఠశాల ముందు రోడ్డు పై బైఠాయించి ఆందోళనకు దిగారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ రవి మహేంద్ర గత కొన్ని రోజులుగా విద్యార్థులతో బూతులు మాట్లాడుతూ, కొడుతున్నారని, ఇది ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తే బయటకు రా చూసు కుందామని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

అనంతరం ఈ విషయమై ఇన్ చార్జి ప్రిన్సిపాల్ రవి మహేంద్రను సంప్రదించగా, విద్యార్థులతో బూతులు మాట్లాడటం, కొట్టడం చేయలేదని, విద్యార్థులను కొన్ని విషయాల్లో మందలిస్తే విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.

# వనదేవతలకు ఎస్పీ పూజలు

### -మేడారం ఆలయాన్ని దర్శించుకున్న సుధీర్ రామ్నాథ్ కేకన్

ములుగు, నవంబర్ 24: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారాలమ్మ వనదేవతలను నూతన ములుగు జిల్లా ఎస్పీసుధీర్ రామ్నాథ్ కేకన్ దర్శించుకున్నారు. ముందుగా పూజారుల సంప్రదాయంగా డోలు వాయిద్యాల తో గద్దెల వద్దకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తల్లులకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, బెల్లం, కొబ్బరికాయలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో ములుగు ఓఎస్డి శివం ఉపాధ్యాయ, డిఎస్పి రవీందర్, పస్రా సీఐ దయాకర్, శంకర్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ మధుకర్, పూజారులు జగ్గారావు, సారయ్య, కొక్కెర రమేష్, పోలీస్ సిబ్బంది రమేష్, పూజారి రమేష్, వెంకటేశ్వర్లు, రజినీకర్, దేవాదాయ శాఖ జగదీశ్, పాల్గొన్నారు.

# పెట్టుబడి సాయం కౌలు రైతులకు ఇవ్వాలి

## –మంత్రికి వినతిపత్రం అందజేసిన కౌలు రైతు సంఘం నేతలు



తిరుపతి, నవంబర్ 24: కౌలు రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇవ్వాలని, భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడుకి ఏపీ కౌలు రైతుల సంఘం నాయకులు కోరారు. ఘంటసాల విచ్చేసిన మంత్రికి వినతిపత్రాన్ని నేతలు అందించి సమస్యను తెలియజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఎన్నికల ముందు కౌలు రైతులకు రూ. 20 వేలు పెట్టుబడి సాయమందిస్తానని హామీ ఇచ్చి, 16 నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదని, వారికి ఈ పథకం వర్తింపచేయాలని కోరారు. పంట రుణాలు ప్రతీ కౌలు రైతుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) నిబంధనల ప్రకారం రూ.2 లక్షల వరకు హామీ లేని, వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు.

మొంథా తుఫాన్ల తర్వాత వీచిన గాలులకు సుంకురాలి, దిగుబడి గణనీయంగా తగ్గుతుందని, గింజ రంగు మారటం, పాయ రావటం, తప్పు, తాలు వచ్చి పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. దీనికి తోడు రాబోయే తుపానుల దృష్ట్యా తేమశాతాన్ని నిబంధనలు సడలించి ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, చల్లపల్లి మండల కౌలు రైతు సంఘం కార్యదర్శి కోలా హరిబాబు, సీఐటీయూ నాయకులు మహమ్మద్ కరీముల్లా, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వాకా రామచంద్రరావు, భలే రమేష్ మోపిదేవి మండల కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. కోడూరు మండలంలో 22ఏ (ఏడబ్ల్యాడి) భూములను, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు మంత్రి అచ్చెంనాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

# ధైర్యం, మంచి మనసుల ప్రయాణం - ఐఎఫ్ఎఫ్ఐలో ప్రేక్షకులను కదిలించిన 'తన్వి ది గ్రేట్'

న్యూఢిల్లీ, నవంబర్ 24: హృదయానికి హత్తుకునే సినిమాలు, స్ఫూర్తిదాయకమైన కథా కథనాలతో ఈ సాయంత్రం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ఆహ్లాదకరంగా సాగింది. ఎన్నో ప్రశంసలు పొందిన చిత్ర నిర్మాత, నటుడు, దర్శకుడు అనుపమ్ ఖేర్ తన తాజా దర్శకత్వ వెంచర్ 'తన్వి ది గ్రేట్'ను ప్రదర్శించారు. ఆటిజం స్పెక్ట్రమ్ సమస్య గల ఒక అసాధారణ అమ్మాయి తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సైన్యంలో చేరాలనే తన కలను సాకారం చేసుకోవాలనుకునే ప్రయత్నమే ఈ చిత్రం. ఆటిజం లక్షణాల కారణంగా ఇతరులు తన గురించి తప్పుగా భావించినప్పటికీ... నిజమైన హీరోయిజం హృదయం నుంచే వస్తుందని నిరూపించే కథ ఇది. ఉత్సవంలో ఈ చిత్ర ప్రదర్శన తర్వాత నటి తన్వితో కలిసి అనుపమ్ ఖేర్ మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి ప్రేక్షకులు, ప్రతినిధుల నుంచి అసాధారణమైన హృదయపూర్వక, ఉత్సాహభరితమైన స్పందన లభించింది.

మీడియాతో జరిగిన సంభాషణలో అనుపమ్ ఖేర్ ఈ చిత్ర వ్యక్తిగత ఔచిత్యం గురించి సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ కథ తన వ్యక్తిగత, కుటుంబ జీవితంలోని సందర్భాలతో ముడిపడి ఉన్నదనీ, చిత్రనిర్మాతగా ఈ ప్రాజెక్ట్ తనకు భావోద్వేగపరంగా ఎంతో ముఖ్యమైనదని ఆయన తెలిపారు. ఆటిజం గురించి అనుపమ్ ఖేర్ మాట్లాడుతూ... మనం తరచుగా "సాధారణ" అనే పదానికి వ్యతిరేక పదం "అసహజం"అని భావిస్తామని, కానీ సాధారణం అనే పదానికి వ్యతిరేకం "అద్భుతం" కూడా అవుతుందని అన్నారు. మానవ సమర్థత, సానుభూతి, పరివర్తనను హైలైట్ చేసే కథనాల పట్ల తాను ఎక్కువగా ఆకర్షితుడనయ్యానని ఖేర్ స్పష్టం చేశారు. "మానవ భావోద్వేగాల మూలాన్ని స్పృశించే... వ్యక్తులు వారి జీవితాల్లో సానుకూలమైన, అర్థవంతమైన మార్పులను తీసుకురావడానికి ప్రేరేపించే" చిత్రాలపై నిరంతరం పనిచేయడం పట్ల తన నిబద్ధతను వ్యక్తం చేశారు.

ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ ముఖ్యాంశాల్లో ఒకటి... ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన నటి శుభాంగి దత్. ఆమె 'తన్వి ది గ్రేట్' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. కెమెరా ముందు తన మొదటి అనుభవం గురించి మాట్లాడుతూ, అనుపమ్ ఖేర్ దర్శకత్వం... ఆయన క్రమశిక్షణ... అవగాహనతో కూడిన ఆయన విధానం అద్భుతమని శుభాంగి ప్రశంసించారు. ఆయనను "కఠినమైన గురువు"గా అభివర్ణించిన శుభాంగి... ఆయన మార్గదర్శకత్వం తన నటనను బలోపేతం చేయడమే కాకుండా తన సొంత కళాత్మక సామర్థ్యాన్ని కనుగొనడంలోనూ సహాయపడిందని పేర్కొన్నారు

# 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 'లెజెండ్స్ ఆఫ్ ఇండియన్ సిల్వర్ స్క్రీన్' పుస్తకావిష్కరణ

న్యూఢిల్లీ, నవంబర్ 24: గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) లో ఈ సాయంత్రం 'లెజెండ్స్ ఆఫ్ ఇండియన్ సిల్వర్ స్క్రీన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. డైరెక్టరేట్ ఆఫ్ పబ్లికేషన్ డివిజన్ (డీపీడీ) ఈ పుస్తకాన్ని తాజాగా ప్రచురించింది. ఐఎఫ్ఎఫ్ఐలోని పీఐబీ ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీపీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ భూపేంద్ర కైంతోలా ప్రఖ్యాత కొంకణి చిత్ర దర్శకుడు రాజేంద్ర తలక్ తో కలిసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

శ్రీ కైంతోలా ఈ పుస్తకం ప్రాముఖ్యతను వివరిస్తూ, "భారత అత్యున్నత చలనచిత్ర పురస్కారం-దాదాసాహెబ్ ఫాల్కే- అవార్డును గెలుచుకున్న దిగ్గజాల ప్రయాణాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. 1969 నుంచి 1991 మధ్య ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న దేవికా రాణి, సత్యజిత్ రే, వి. శాంతారాం, లతా మంగేష్కర్ వంటి దిగ్గజాలతో సహా, 23 మంది జీవితాలను ఈ పుస్తకం ఆవిష్కరిస్తుంది" అని అన్నారు.

"ఈ పుస్తకం సంకలన సంపాదకుడు సంజిత్ నార్వేకర్ కాగా, 17 మంది రచయితలు రాసిన 23 వ్యాసాల సమాహారం" అని శ్రీ కైంతోలా తెలిపారు. ఇద్దరు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీతలు, మిథున్ చక్రవర్తి, ఆశా పరేఖ్ ఈ పుస్తకానికి ముందుమాటలను రాయడం మరో ఆసక్తికరమైన అంశమని ఆయన తెలిపారు. పుస్తకంలోని అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేయడానికి, శ్రీ కైంతోలా ముందుమాట నుంచి కొన్ని భాగాలను చదివి వినిపించారు.

"సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని పబ్లికేషన్ డివిజన్ ఇలాంటి ముఖ్యమైన విశేషాలను పుస్తకాలుగా ముద్రించి తక్కువ ధరకు అందించే బాధ్యత కలిగి ఉంది. పరిశోధకులకు, అలాగే కేవలం సినిమాను ఆకర్షణ, శోభ మాత్రమే కాకుండా, అంతకు మించి దాని చరిత్రను అర్థం చేసుకోవాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఎంతో విలువైంది" అని శ్రీ కైంతోలా చెప్పారు.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన పబ్లికేషన్ డివిజనుకు కొంకణి చిత్ర దర్శకుడు రాజేంద్ర తలక్ అభినందనలు తెలిపారు. "నేటి తరానికి ఊహించడం కూడా కష్టమైన అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య ఈ దిగ్గజాలు సినిమాలను సృష్టించారు. చిత్ర నిర్మాణ కళను అర్థం చేసుకోవాలనుకునే ఎవరికైనా ఈ పుస్తకం ఉపయోగపడుతుంది" అని ఆయన అన్నారు.

చిత్ర విజయం లేదా వైఫల్యంతో సంబంధం లేకుండా, కఠోర శ్రమపై దృష్టి పెట్టవలసిన అవసరాన్ని ప్రముఖంగా చెబుతూ, ఆ దిగ్గజాల ప్రేరణాత్మక సినీ ప్రయాణమే ఇందుకు ఉదాహరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

"నిస్సందేహంగా, సినిమా అనేది సున్నితంగా ప్రభావం చూపే శక్తి. అయితే, ఇది భారతదేశంలో ఒక వారసత్వం కూడా. మనం ఆ వారసత్వం నుంచి నేర్చుకోవాలి. దానిని పైపై ఆకర్షణను దాటి చూడాలి" అని ఒక ప్రశ్నకు సమాధానంగా శ్రీ కైంతోలా అన్నారు. రచనలో ప్రామాణికత ప్రాముఖ్యతను కూడా ఆయన స్పష్టంగా చెప్పారు.

విస్తృత ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా పుస్తకం భాష సరళంగా ఉండాలని అన్నారు. వివిధ ఆన్‌లైన్ వేదికల్లో, అలాగే ఐఎఫ్ఎఫ్ఐ వేదిక వద్ద ఉన్న పబ్లికేషన్ డివిజన్ స్టాల్‌లో కూడా ఈ పుస్తకం కొనుగోలుకు అందుబాటులో ఉందని శ్రీ కైంతోలా తెలియజేశారు.

1991 తర్వాత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్న వారి జీవితాలను పరిశోధించే విధంగా, ఈ పుస్తకం రెండో ఎడిషన్‌ను కూడా ప్రచురించాలని శ్రీ రాజేంద్ర తలక్ చేసిన సూచనకు శ్రీ కైంతోలా సానుకూలంగా స్పందించారు.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ), దక్షిణ ఆసియాలోనే అత్యంత పురాతనమైన, అతిపెద్ద సినిమా ఉత్సవంగా పేరు గాంచింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్డీసీ), గోవా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా (ఈఎస్జీ) సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. పునరుద్ధరించిన పాత సినీ కళాఖండాలు, ఆధునిక ప్రయోగ చిత్రాల ప్రదర్శనతో దిగ్గజ దర్శకులు, మొదటిసారి చిత్రాలు తీసిన కొత్త, సాహసోపేత దర్శకులు ఒకే వేదికను పంచుకునే ఈ ఉత్సవం, అంతర్జాతీయ సినీశక్తి కేంద్రంగా ఎదిగింది. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, నివాళులు ఆలోచనలు, ఒప్పందాలు, భాగస్వామ్యాలు, అత్యంత ఉత్సాహభరితమైన 'వేవ్స్ ఫిల్మ్ బజార్' వంటి వైవిధ్యభరిత అంశాల కలయిక ఇఫీని ప్రకాశవంతంగా మార్చాయి. నవంబర్ 20 నుంచి 28 వరకు గోవా సుందర తీరప్రాంత నేపథ్యంలో జరిగే 56వ ఎడిషన్ భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుతమైన వైవిధ్యాన్ని హామీ ఇస్తోంది. ఇది ప్రపంచ వేదికపై భారతదేశ సృజనాత్మక ప్రతిభను సమగ్రంగా ప్రదర్శించే వేడుక.

# సృజనాత్మకత... సాంకేతికతల సంగమంలో కృత్రిమ మేధ...

## కథా శ్రవణం.. నవశకంలో సినిమా రంగంపై మేధా మథనం

న్యూఢిల్లీ, నవంబర్ 24: గోవాలో 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి) ప్రారంభమైన నేపథ్యంలో "యాన్ యురేషియన్ ఫెస్టివల్ ఫ్రాంటియర్: డూ వియ్ నీడ్ టు రీడిఫైన్ సినిమా ఇన్ ది వరల్డ్ ఆఫ్ ఏఐ" (యురేషియా వేడుకల నేపథ్యం: కృత్రిమ మేధా ప్రపంచంలో సినిమాను మనం పునర్నిర్వచించాల్సి ఉందా?) అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠి ఇద్దరు అత్యంత గౌరవనీయ అంతర్జాతీయ వేడుకల ప్రముఖులను ఒకే వేదికపైకి తెచ్చింది. ఈ మేరకు 'బెర్లిన్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం' డైరెక్టర్ ట్రిసియా టటిల్, 'ఇఫి' డైరెక్టర్ శేఖర్ కపూర్ ఇందులో పాలుపంచుకున్నారు. ఈ గోష్ఠికి కపూర్ సమన్వయకర్తగా వ్యవహరించినప్పటికీ, వారి మధ్య అభిప్రాయాల ఆదాన ప్రదానం ఒక గతిశీల ముఖాముఖి సంభాషణలా సాగింది. ఈ సందర్భంగా కృత్రిమ మేధ, సృజనాత్మకత, చలన చిత్రోత్సవాల భవిష్యత్తు సంబంధిత భవిష్యత్ సంగమంపై వారు దృష్టి సారించారు.

ప్రపంచంలోని రెండు ప్రధాన చలనచిత్రోత్సవ డైరెక్టర్ల సౌహార్ద్ర, వ్యక్తిగత వ్యాఖ్యలతో ఈ గోష్ఠి ఉల్లాసంగా మొదలైంది. ఈ మేరకు ప్రస్తుత 'ఇఫి' వేడుకలలో ప్లాస్టిక్ సీసాల వినియోగం లేకపోవడంపై శేఖర్ కపూర్ తొలుత నిర్వాహకులను అభినందించారు. ఇక ట్రిసియా టటిల్ మాట్లాడుతూ- తాను 1998లో శేఖర్ కపూర్ తన చిత్రం 'ఎలిజబెత్'పై ప్రసంగించిన 'మాస్టర్ క్లాస్'కు చలనచిత్ర పాఠశాల యువ గ్రాడ్యుయేట్‌గా హాజరైన క్షణాలను గుర్తుచేసుకున్నారు. "చరిత్ర పునరావృతమవుతుంది" అన్న రీతిలో తానెంతో సంభ్రమానికి గురయ్యానంటూ గత అనుభవాలను సినిమా రంగం భవిష్యత్తుతో సంధానించే అంశంపై చర్చకు నాంది పలికారు.

సాంకేతికత ఎంత అధునాతనమైనా... అది డిజిటల్ లేదా కృత్రిమ మేధ అయినా, సినిమా శాశ్వతం కాబట్టి మానవ సృజన మనుగడకు ఢోకా ఉండదని చర్చాగోష్ఠిలో శేఖర్ కపూర్ ఆద్యంతం పలుమార్లు ప్రస్తావించారు. కొత్త విజ్ఞానం లేదా ఉపకరణం ఏదైనా దాన్ని అంతిమంగా నడిపించేది దాని సృష్టికర్తేనని స్పష్టం చేశారు. ఆవిష్కరణ ఎలాంటిదైనా దాన్ని వాడుకునే వ్యక్తుల సృజనాత్మకతను అది అధిగమించజాలదని ఆయన ప్రేక్షకులకు గుర్తుచేశారు.

ఇక ట్రిసియా టటిల్ మాట్లాడుతూ- చిత్ర నిర్మాణంలో డిజిటల్ సాంకేతికత రాకతో సినిమా అదృశ్యమవుతుందనే ఆందోళన ఒకనాడు ఎలా భయపెట్టిందో గుర్తుచేశారు. ఆ మేరకు సాంకేతిక మార్పుల చుట్టూ ముసురుకున్న మును పటి కాలపు ఆందోళనలను ఆమె వివరించారు. ఏదేమైనా "శాశ్వతంగా నిలిచేది ఆలోచన, నైపుణ్యం, మానవీయతలే"నని పేర్కొన్నారు. అలాగే, కృత్రిమ మేధ ఎంత పురోగమించినా.. ఒక గొప్ప నటుడు పలికించే సున్నిత భావోద్వేగ వైవిధ్యాన్ని, ముఖ్యంగా కళ్లతో ప్రదర్శించే సూక్ష్మ మార్పులను అర్థం చేసుకోజాలదని శేఖర్ కపూర్ అన్నారు. ఒక్కమాటలో "కృత్రిమ మేధ కంటిపాపల కదలికల్లోని భావాన్ని అర్థం చేసుకోలేదు" అన్నారు. క్షణకాలం మెరిసే ఆ భావోద్వేగమే ప్రేక్షకులను కథలో లీనం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

సరికొత్త సృజనాత్మక ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవడంపై తన ఉత్సాహాన్ని ప్రస్తావిస్తూ- 'వార్ లార్డ్' పేరిట రూపొందించిన ఏఐ-సిరీస్ పరిచయ సన్నివేశాన్ని ప్రేక్షకులకు ప్రదర్శించారు. ఈ విధంగా అందివచ్చిన అవకాశాన్ని తాను వాడుకున్నప్పటికీ, సాంకేతికత కథకుడిని పునర్నిర్వచించజాలదని చెప్పారు. వాస్తవానికి కథకుడే సాంకేతికతకు కొత్త రూపమిస్తాడంటూ తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

కపూర్ తన ప్రసంగం కొనసాగిస్తూ- తన ఇంటి వంటమనిషి 'చాట్‌జీపీటీ' సాయంతో 'మిస్టర్ ఇండియా-2' సినిమా కోసం చిత్రకథ రాయడంపై హాస్యభరితంగా వివరించిన ఉదంతం ప్రేక్షకులను ఉల్లాసపంచింది. "ఆ కథను తయారుచేశాక అతనెంతో ఉత్సాహంతో నా దగ్గరకు వచ్చాడు" అని గుర్తుచేసుకుంటూ- "అతడి వంట లేదా సినిమా కథ వంటకాలలో దేన్ని మొదట అభినందించాలో ఒక్క నిమిషం నాకు అర్థం కాలేదు" అన్నారు. సృజనాత్మక ఉపకరణాలు అందుబాటులోకి వచ్చిన తీరు, ఊహకైనా అందని ప్రదేశాల్లో కూడా మానవ ఊహాశక్తికి సాంకేతికత ఎలా ఉత్తేజమివ్వగలదో ఆయన హాస్యస్ఫోరక కథనం స్పష్టం చేసింది.

సాంకేతిక పరిజ్ఞాన మార్పుల్లో వేగం పెరిగినా ఒక సమష్టి సామాజిక అనుభవంగా సినిమా ఎలా మిగిలిందో వక్తలిద్దరూ చర్చించారు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూసే సామాజిక అనుభవాన్ని 'ఏఐ ఉపకరణాలు, లేదా ఇళ్లలో టీవీ చూసే అలవాట్లు అధిగమించడం అసాధ్యమని శేఖర్ కపూర్ అన్నారు. "రుచికరమైన వంటకాలు ఇంటికే అందుతున్నా ప్రజలు ఇప్పటికీ రెస్టారెంట్లకు వెళ్తున్నారు" అని ఆయన ఉదాహరించారు. స్వతంత్ర, సాహసోపేత చిత్రానుభవం ఇచ్చే వేదికల సంరక్షణ ప్రాధాన్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దీన్ని కొనసాగించే బాధ్యత చలనచిత్రోత్సవాలదేనని ట్రిసియా టటిల్ స్పష్టం చేశారు.

చిత్ర నిర్మాణంలో తగ్గిపోతున్న కార్మికశక్తి పరిమాణం, సినిమా రంగంతో ముడిపడిన వారి భవిష్యత్తుపైనా గోష్ఠిలో చర్చించారు. సినిమా సెట్ మీద కార్మిక బృందంలో ఒకరుగా ఉండటంలోని అనుభూతిని ట్రిసియా టటిల్ ప్రముఖంగా ప్రస్తావించారు. తన కుమారుడు ఒకప్పుడు రచన లేదా దర్శకత్వంపైన కాకుండా చిత్ర బృందంలో ఒకరుగా పనిచేయడంపై ఆసక్తి చూపడాన్ని ఈ సందర్భంగా ఆమె ఉదాహరించారు. చిత్రనిర్మాణ ప్రపంచాన్ని లోతుగా అర్థం చేసుకోవాలంటే అదే మెరుగైన మార్గమన్నది అతడి అభిప్రాయమని చెప్పారు. శేఖర్ కపూర్ మాట్లాడుతూ... సరైన సమయంలో "యాక్షన్ – కట్" చెప్పే సామర్థ్యం కోల్పోతానేమోనని ఆందోళన చెందుతున్నట్లు చమత్కరించారు. ఏదేమైనా సెట్‌పై ఏర్పడే మానవ సంబంధాలను ఎలాంటి కృత్రిమ మేధ ఉపకరణంతోనైనా సృష్టించలేమని పేర్కొన్నారు.

ప్రేక్షకులతో సంభాషణ సందర్భంగా కథాచౌర్యం (కాపీరైట్), నైతికత, ఏఐ కళాత్మక చట్టబద్ధతపై పలువురు ప్రశ్నలు సంధించారు. దీనిపై శేఖర్ కపూర్ స్పందిస్తూ- "ఏఐ అంటే మాయాజాలమేమీ కాదు. ఇందులో గందరగోళానికి తావు లేదు. ఇదొక అనివార్యమైన పరిణామం మాత్రమే. కానీ, వాస్తవికంగా కథను చెప్పడం ఊహలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఏఐ గతాన్ని అనుకరించగలదే తప్ప భవిష్యత్తును ఊహించజాలదు" అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. కృత్రిమ మేధతో లేదా దానితో నిమిత్తం లేకుండా సృజనపై బద్ధకమే కథాచౌర్యానికి దారితీస్తుందన్నారు. భావోద్వేగ పూరితంగా కథ చెప్పడం వెనుక మానవ మేధ ఉనికి సదా ప్రస్ఫుటం అవుతుందని స్పష్టం చేశారు.

చివరగా, సినిమా రంగం నిరంతర పరిణామశీలం... అయితే, మానవుని ఊహాశక్తి, భావోద్వేగ వాస్తవం, కథకుగల శక్తి ప్రతి సాంకేతిక మార్పునూ అధిగమించగలవని వక్తలిద్దరూ ఏకాభిప్రాయం వెలిబుచ్చడంతో చర్చాగోష్ఠి ముగిసింది. అనంతరం సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్ వందన సమర్పణతో కార్యక్రమం సమాప్తమైంది.

భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ నేపథ్యం

దక్షిణాసియా సినిమా రంగానికి సంబంధించి 1952లో మొదలైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ-ఇఫి) అత్యంత ప్రాచీనమైనదేగాక ఘనమైన వేడుకగా ప్రపంచ గుర్తింపు పొందింది. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్డీసీ), కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, గోవా రాష్ట్ర 'గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ' (ఈఎస్జీ) ఈ ఉత్సవాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ సినిమా రంగంలో ఒక శక్తిగా ఎదిగిన ఈ వేడుకలలో పాత సినిమాలకు కొత్త హంగులతో చేసిన సాహస ప్రయోగాలు, తొలిసారి రంగంలో ప్రవేశించిన ప్రతిభావంతులతో పరిశ్రమ దిగ్గజాల అరమరికలు లేని ముచ్చట్లు అందర్నీ అలరిస్తాయి. వాస్తవంగా ఈ చలనచిత్రోత్సవానికి వన్నెలద్దేది దాని ఉజ్వల సమ్మేళనమే. ఇందులో అంతర్జాతీయ పోటీ, సాంస్కృతిక ప్రదర్శనలు, దిగ్గజాల ప్రసంగాలు (మాస్టర్ క్లాసులు), ప్రశంసలు సహా ఆలోచనలు, ఒప్పందాలు, సహకారం తదితరాలకు ఉత్తేజమిచ్చే శక్తిమంతమైన 'వేవ్స్ ఫిల్మ్ బజార్' ప్రత్యేక ఆకర్షణలు. అద్భుత తీరప్రాంతమైన గోవా నేపథ్యంలో మరింత వెలుగులు విరజిమ్ములా ఈ నెల 20 నుంచి 28 వరకు 56వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది ప్రపంచ వేదికపై భారత సృజనాత్మక ప్రతిభకు అద్దంపటే అద్భుత వేడుక. భాష, శైలి, ఆవిష్కరణ, గళాల అద్భుత సమ్మేళనం ఈ ఉత్సవాల్లో కనువిందు చేస్తుందనడంలో సందేహం లేదు.

# దూరదర్శన్ ద్వారా సినిమా ప్రపంచానికి పరిచయం కావడం మా అదృష్టం: అనుపమ్ ఖేర్

న్యూఢిల్లీ, నవంబర్ 24:సంవత్సరాలుగా ఒక మామూలు చలనచిత్రోత్సవం స్థాయి నుంచి ఓ ఘనమైన వేడుకగా భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫి) అభివృద్ధి చెందుతూనే ఉంది. సినిమా, సంగీతం, జీవితాల మాయాజాలాన్ని ఒకచోట చేర్చి ఒక అద్భుత వినోద ప్రయాణంగా ఇది ముందుకు సాగుతోంది. గత సంవత్సరం ఈ సాంస్కృతిక ప్రయాణానికి మార్గనిర్దేశం చేసే బాధ్యతను ఇఫీస్టా సగర్వంగా చేపట్టింది. సంగీతం, కళలను ఇఫి ప్రయాణంతో జతచేసింది.

గోవాలోని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో నిన్న సాయంత్రం దూరదర్శన్, వేవ్స్ ఓటీటీలు నిర్వహించిన ఇఫీస్టా ప్రారంభోత్సవం ద్వారా ఐఎఫ్ఎఫ్ఐ 56వ ఎడిషన్... సంగీతం, సంస్కృతి, లైవ్ ప్రదర్శనల ద్వారా మనస్సును ఆహ్లాదపరిచే తన అద్భుత సాంప్రదాయాన్ని కొనసాగించింది.

నక్షత్రాలతో మెరిసిపోయే చల్లని సాయంత్రం వేళ ప్రముఖ కళాకారులంతా తమ నైపుణ్యాల వెలుగులను పంచుతూ వేదికను అలంకరించారు. వారిలో గౌరవనీయ నటుడు శ్రీ అనుపమ్ ఖేర్, ఆస్కార్ అవార్డు గ్రహీత శ్రీ ఎం ఎం కీరవాణి, అస్సాంకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత, నటి ఐమీ బారుహ్, ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు రవి కొట్టారకర, దక్షిణ కొరియాకు చెందిన మనోహరమైన స్వరం ఎం పి జేవోన్ కిమ్ తదితరులు ఉన్నారు. దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. సతీష్ నంబూద్రిపాద్‌తో కలిసి వారు సినిమా మాయాజాల వేడుకల కోసం సమావేశమయ్యారు.

డీజీ శ్రీ నంబూద్రిపాద్ తన ప్రారంభోపన్యాసంలో... "ఉపగ్రహ విప్లవం ఫలితంగా ఏర్పడిన వంశపారంపర్య ఛానల్ ప్రజలు ఎప్పుడైనా కార్యక్రమాలను చూడగలిగేలా చేతిలో ఇమిడిపోయే పరికరాలతో నెమ్మదిగా డిజిటల్ విప్లవానికి దారి తీస్తోందని మనందరికీ తెలుసు. డిమాండ్‌కు అనుగుణంగా దూరదర్శన్ అభివృద్ధి చెందడం సముచితం. వేవ్స్ ఓటీటీతో కొత్త డిజిటల్ దశలోకి ప్రవేశించడం ద్వారా దూరదర్శన్ సరైన పనిచేస్తోంది. వేవ్స్ ఓటీటీ కుటుంబాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వినోదాన్ని అందిస్తుంది." అని అన్నారు. "డిజిటల్ పరికరాలకు అతుక్కుపోతున్న జనరేషన్ జీ యువతరం... దూరదర్శన్ ప్రాతినిధ్యం వహించిన లేదా ప్రాతినిధ్యం వహించే వారసత్వ బలాన్ని చూడటానికి దూరదర్శన్‌కు రావాలని మేం అభ్యర్థిస్తున్నాం." అని కోరారు.

అనంతరం శ్రీ ఖేర్ ఇఫీస్టా వేదికపై తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ... "మనమంతా దూరదర్శన్ ద్వారా మన సినీ జీవితాన్ని ప్రారంభించాం. దూరదర్శన్ మనల్ని సినిమా ప్రపంచానికి పరిచయం చేయడం మన అదృష్టం. నేనూ దూరదర్శన్ వల్లే ఈ రంగానికి వచ్చాను... ఎన్నిటికీ దానిని నేను మర్చిపోలేను. దూరదర్శన్ మన జీవితాల్లో నిలిచి ఉండే పరిమళం... ఎప్పటికీ మనల్ని

# రూ. 29,500 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన




హైదరాబాద్, నవంబర్ 24: హైదరాబాద్‌లో జరిగిన "మధ్యప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలు" వ్యాపార సదస్సు సందర్భంగా యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 29,500 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనను సమర్పించింది. ఈ సదస్సులో మధ్యప్రదేశ్ ప్రభుత్వం అందుకున్న రూ. 36,600 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలో ఇది అత్యధికం.

ఎంపీ పెట్టుబడి ప్రవాహానికి అత్యధిక సహకారం

యాక్సిస్ ఎనర్జీ ప్రతిపాదన, ఈ సదస్సులో సమర్పించబడిన అతిపెద్ద పెట్టుబడి ప్రతిపాదనలలో ఒకటి, భారతదేశంలో క్లీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాలను విస్తరించాలనే కంపెనీ దీర్ఘకాలిక లక్ష్యంను ఇది పునరుద్ఘాటిస్తుంది.

ఈ కార్యక్రమంలో ప్రకటించిన పెట్టుబడి ప్రతిపాదనలు వివిధ రంగాలలో సుమారు 27,800 మందికి ఉపాధిని కల్పిస్తాయని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆశిస్తోంది. రైలు , పారిశ్రామిక అభివృద్ధితో సహా మౌలిక సదుపాయాల రంగాల లో పురోగతిని కూడా రాష్ట్రం హైలైట్ చేసింది.

పరిశ్రమ-ప్రభుత్వ అనుసంధానతను బలోపేతం చేయడం

ఈ సమావేశంలో గౌరవనీయులైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సీనియర్ పరిశ్రమ ప్రతినిధులతో పూర్తి స్థాయి చర్చలు జరిపారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడానికి రాష్ట్రం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. రాష్ట్రం యొక్క చురుకైన విధానాన్ని యాక్సిస్ ఎనర్జీ అభినందిస్తుంది. స్వచ్ఛ ఇంధన వృద్ధిని నడిపించడంలో సహకార భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తోంది.

# గుత్తికోయలకు బ్లాంకెట్స్, స్వెటర్ల పంపిణీ



ములుగు, నవంబర్ 24:ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం బుటారం గుత్తికోయ గూడెంలో ఆదివాసీ కుటుంబాలకు ఉపశమనంగా శీతాకాల సహాయ సామాగ్రిని అందించారు. రిలయబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సహకారంతో చింతలపాడు, గుండంగా వాయ్, గంటలకుంట ప్రాంతాల గుత్తికోయలకు మొత్తం 208 బ్లాంకెట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు.

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా?శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి పాల్గొన్నారు.

# సామాజిక భద్రత, కనీస వేతనాలపై చట్టాల దృష్టి: ఐఎల్ఓ డైరెక్టర్-జనరల్

న్యూఢిల్లీ, నవంబర్ 24:నాలుగు కార్మిక కోడ్ లను అమల్లోకి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం చేసిన ప్రకటనను అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), అంతర్జాతీయ సామాజిక భద్రతా సంఘం (ఐఎస్ఎస్ఏ) వంటి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థలు స్వాగతించాయి. సామాజిక భద్రతను బలోపేతం చేయటం, కనీస వేతన వ్యవస్థలను మెరుగుపరచటం, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించటం దిశగా ఈ సంస్కరణలను కీలకమైనవిగా గుర్తిస్తూ.. సమగ్ర, ఆధునిక కార్మిక వ్యవస్థలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చకు భారత్ చేస్తున్న కృషి దోహదపడుతుందని అంతర్జాతీయ సంస్థలు తెలిపాయి. ప్రపంచ కార్మిక, సామాజిక భద్రతా ప్రమాణాలను రూపొందించటంలో పెరుగుతున్న భారత నాయకత్వాన్ని అంతర్జాతీయ సంస్థల వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

భారత కార్మిక సంస్కరణలను ప్రశంసించిన ఐఎల్ఓ డైరెక్టర్-జనరల్

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) డైరెక్టర్ జనరల్ తన పోస్టులో ఈ విధంగా పేర్కొన్నారు: "ఇవాళ భారత్ ప్రకటించిన కొత్త కార్మిక కోడ్ ల పరిణామాలను.. ముఖ్యంగా సామాజిక భద్రత, కనీస వేతనాలకు సంబంధించిన వాటిని నిశితంగా గమనిస్తున్నాను. సంస్కరణలు కార్మికులు, వ్యాపారులకు సానుకూలంగా ఉండేలా చూసేందుకు వాటిని అమలు చేసేటప్పుడు ప్రభుత్వం, యజమానులు, కార్మికుల మధ్య సంప్రదింపులు అవసరం"

**భారత కార్మిక చట్టాలను స్వాగతించిన ఐఎస్ఎస్ఏ**

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఇలా పేర్కొంది: "పటిష్టమైన, సమగ్రమైన సామాజిక భద్రతా వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రయత్నాలకు భారత కార్మిక కోడ్ లు మరింత ఉత్తేజం కలిగిస్తున్నాయి. ఈ కీలక అంశాన్ని ఐఎస్ఎస్ఏ స్వాగతిస్తోంది. పరిధి, భద్రత, సంస్థాగత సామర్థ్యం కోసం నిరంతర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది".

భారతదేశ కార్మిక కోడ్ లపై ప్రధాన ప్రపంచ సంస్థలు వెలువరించిన ప్రకటనలు, సానుకూల అంతర్జాతీయ స్పందనను ప్రతిబింబిస్తున్నాయి. న్యాయమైన వేతనాలను అందించటం, సామాజిక భద్రతా పరిధిని పెంచటం, శ్రామిక శక్తిని వ్యవస్థాగతం చేయటం వంటి అంశాల్లో ఈ కోడ్ లు పురోగతిని కనబరుస్తున్నాయి. భారత కార్మిక వ్యవస్థను మరింత బలోపేతం చేయటానికి, సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసేందుకు, అంతర్జాతీయ సంస్థలు, దేశీయ వాటాదారులతో నిరంతర సహకారాన్ని కొనసాగించేందుకు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు



తమిళనాడు, నవంబర్ 24: తమిళనాడు రాష్ట్రంలో "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా తీరుపుత్తూరు జిల్లా డీసీసీ అధ్య క్షుడి ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏఐ సీసీ పరిశీలకులుగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీ కృష్ణ చెన్నై చేరుకున్నారు. ఈ సందర్భంగా తమిళ నాడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. చెన్నై విమానాశ్ర యంలో వంశీకృష్ణకు పూలమాలలతో స్వాగతం పలికిన స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయనను పరిశీలకుడిగా నియమించడం పార్టీ బలోపేతా నికి, తమిళనాడు కాంగ్రెస్ పునర్వ్యవస్థీకరణకు ఎంతో దోహదం చేస్తుందని అభినందించారు.

డీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియలో పూర్తిగా పారదర్శకంగా, పార్టీ హైకమాండ్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని వంశీకృష్ణ నేతలకు హామీ ఇచ్చారు.

స్థానిక నాయకులతో చర్చలు జరిపి, అభ్యర్థుల అభిప్రాయాలు సేకరించి, తగిన నివేదికను ఏఐసీసీకి పంపనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. డా. వంశీకృష్ణ పార్టీ శ్రేణుల్లో క్రమశిక్షణ, నిర్వహణ పరంగా మంచి పేరును సంపాదించుకున్నారని, ఆయన నాయకత్వం ఈ ఎంపిక ప్రక్రియకు ప్రత్యేకమైన నిష్పాక్షికతను తీసుకువస్తుందని తమిళనాడు కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## –డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్

డోర్నకల్, నవంబర్ 24:రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ అన్నారు .సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండిస్తున్న ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉండడమే ప్రధాన ఉద్దేశం అని తెలిపారు.

రైతులు తమ పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించామని,తూకంలో పారదర్శకత పాటిస్తూ చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మరికొన్ని పథకాలు అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో అంజలి,మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్,చైర్మన్ రాము గౌడ్,వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బ సోమిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరోజు రాజశేఖర్, సొసైటీ డైరెక్టర్లు పోలేపల్లి రజనీకాంత్ రెడ్డి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ వేముల విజయకుమార్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కడుదుల రామకృష్ణ, అలువాల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్,సోషల్ మీడియా ఇన్చార్జి చిర్ర సతీష్ గౌడ్, రేఖ అనిల్,దూరు యాకన్న, ఎర్ర రవి తదితరులు ఉన్నారు.

# బీజేపీలో భారీగా చేరికలు

ఆదిలాబాద్, నవంబర్ 24: కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రాలకు జిల్లాలకు అనేక నిధులు మంజూరు చేస్తున్నారని ప్రజలు రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులకు ఆదరించాలని బిజెపి పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ అన్నారు. ఈరోజు ఆయన నివాసంలో బిజెపి పార్టీ మండల శాఖ ఆధ్వ ర్యంలో పలువురు పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానిం చారు.

బిజెపిలో చేరిన వారిలో కుమారి బానోవత్ సంగీత, చౌహాన్ శాంత, సీనాభాయి,ఆడే మోబిలాల్, పవర్ అశోక్, జాదవ్ రాజు నాయక్, జాదవ్ దేవ్ సింగ్, తో పాటు పలువురు చేరారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధుల నుండే రాష్ట్రంలో అభివృద్ధి పనులు నడుస్తున్నాయని ప్రజలంతా గమనించి బిజెపి పార్టీకి బలపరిచిన సర్పంచ్, వార్డ్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూరు మండల అధ్యక్షులు బింగి వెంకటేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ టేకం హరిప్రసాద్, ఎస్టి మోర్చా జిల్లా కార్యదర్శి రాథోడ్ శేషారావు, సీపతి లింగాగౌడ్, బొడ్డు కిరణ్, కాల్వ రవి, ఉగ్గే విజయ్, చింతల రమణ, బి జితేందర్. బూత్ అధ్యక్షులు జాదవ్ సతీష్, పులి శ్రీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సొంతింటి కల సాకారం..

## – మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నల్గొండ, నవంబర్ 24: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేస్తూ పేదల కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆవుల సాయవ్వకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తయి, సోమవారం రోజు గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

ప్రభుత్వం సంకల్పించిన "ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం" లక్ష్యంగా ఇందిరమ్మ పథకం వేగంగా అమలవుతోందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లను మంజూరు చేయడంలో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణంలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి బిల్లులను పొందాలని సూచించారు.

అలాగే, గ్రామాల్లో ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభించని పక్షంలో, ఇతర అర్హులైన వారిని ఎంపిక చేసుకునే పరిస్థితి వస్తుందని మంత్రి హెచ్చరించారు. ఆవుల సాయవ్వ కుటుంబం గృహప్రవేశం చేసుకోవడం ఆనందదాయకమని పేర్కొంటూ, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.

అనంతరం కలెక్టర్ తో కలిసి ఆవుల సాయవ్వ నూతన గృహంలో భోజనం చేశారు.

కార్యక్రమంలో ఎమ్మార్వో మాజిద్ ,ఎంపిడివో రవీందర్ రావు, మార్కెట్ చైర్మన్ బీమా సంతోష్ ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పంచాయతీ రిజర్వేషన్లలో బిసిలకు తీవ్ర అన్యాయం

## –బీసీ నేతల ఆందోళన!

ఆదిలాబాద్, నవంబర్ 24: బీసీ రిజర్వేషన్లపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది మరోలా ఉందని, రిజర్వేషన్ల ఖరారుతోనే ప్రభుత్వ నైజనీ బయటపడిందని బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాలో బీసీల రిజర్వేషన్ల లో మొండి చేయి చూపారని, వీటిని మార్చాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ రిజర్వేషన్ లలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపిస్తూ ఆదిలాబాద్ కలెక్టర్ కార్యలయం వద్ద బీసీ నాయకులు ధర్నా చేశారు.

2019 ఎన్నికల్లో జిల్లాలో బిసిలకు 23% రిజర్వేషన్ ఇస్తే, ఈ సారీ కేవలం 11% మాత్రమే ఇచ్చారనీ వారు పేర్కొన్నారు .,2019 లో జిల్లాలో 83 పంచాయతీలకు బీసీ రిజర్వేషన్ కల్పిస్తే ఈ సారీ కేవలం 23 మాత్రమే ఖరారు చేయడం విడురంగా ఉందన్నారు. ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట 42% రిజర్వేషన్ ఇస్తానని చెప్పి మోసం చేసిందని, పాత రిజర్వేషన్ పద్ధతి ప్రకారం కనీసం 23% రిజర్వేషన్ బిసిలకు ఇవ్వాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాలో కేవలం 11% మాత్రమే బిసిలకు రిజర్వేషన్ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన వారిలో ముఖరాకే మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, కిరణ్, వెంకట్ రావ్ వెంకటి, తులసిరాం, రూసికేష్, నాయకులు

# సినీ అద్భుతంతో ఇఫికి నూతన శోభను తీసుకువచ్చిన విధు వినోద్ చోప్రా

న్యూఢిల్లీ, నవంబర్ 24:' 'అన్ స్క్రిప్టెడ్ – సినిమా రూపకల్పనకు కళ, భావోద్వేగం" అనే శీర్షికతో ఇఫిలో జరిగిన ముఖాముఖి కార్యక్రమం ఇవాళ కళా అకాడమీని ఒక సినిమా సెట్‌లా మార్చింది. ప్రఖ్యాత సినీ దర్శకుడు, నిర్మాత విధు వినోద్ చోప్రా, సుప్రసిద్ధ స్క్రీన్‌రైటర్ అభిజాత్ జోషి కలిసి జరిపిన సంభాషణతో అద్భుతం ఆవిష్కృతమైంది. సాధారణంగా శుక్రవారం రోజున విడుదలయ్యే భారీ సినిమాకు ఉండే ఉత్సాహానికి సమానంగా ఈ సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

సన్మాన కార్యక్రమంతో ప్రారంభమైన ఈ సమావేశంలో సంయుక్త కార్యదర్శి (ఫిలిం) డాక్టర్ అజయ్ నాగభూషణ్ ఎంఎన్.. చోప్రా, జోషిలను సన్మానించగా, వారికి ప్రఖ్యాత సినీ నిర్మాత శ్రీ రవి కొట్టారక్కర శాలువాలు కప్పి గౌరవించారు. తనదైన శైలిలో నిజాయితీతో యువ చిత్ర నిర్మాతలకు చోప్రా మార్గనిర్దేశం చేయటాన్ని కొనసాగిస్తారని డాక్టర్ అజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. చోప్రా తీసిన 'పరిందా' చిత్రం "సరికొత్త ఒరవడిని సృష్టించి", భారత సినిమా చరిత్రను తిరగరాసిందని నిర్మాత రవి కొనియాడారు.

సంభాషణ ప్రారంభంలో విధు వినోద్ చోప్రాను అభిజాత్ జోషి మొదటిసారి కలిసిన రోజును గుర్తుచేసుకున్నారు. ఆ రోజు నవంబర్ నెలలోనే ఉందని, ఆ పరిచయమే 'లగే రహో మున్నాభాయ్', '3 ఇడియట్స్' వంటి సినిమాల రూపకల్పనకు దారితీసిందన్నారు. 'పరిందా' నుంచి '12బిఫ్త్ర ఫెయిల్' వరకు సినిమా తీసే పద్ధతి ఏమైనా మారిందా అని చోప్రాను జోషి అడిగారు. చాలా స్పష్టంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా చోప్రా సమాధానమిచ్చారు.

''ఆయా సమయాల్లో నా మనస్తత్వం ఎలా ఉంటుందో, ప్రతి సినిమాలో ఆ వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. 'పరిందా' సమయంలో కోపంగా ఉండేవాడిని. ఆ సినిమాలో మీరు హింసను చూడవచ్చు. కానీ ఇవాళ నేను శాంతంగా ఉన్నాను" అని చెప్పారు.

తన చుట్టూ ఉన్న అవినీతిని చూసి '12బిఫ్త్ర ఫెయిల్' సినిమా తీసినట్లు ఆయన తెలిపారు. "మార్పు కోసం మనం నిజాయితీగా ఉందామని తెలియజేయటానికి నేను ఎంచుకున్న మార్గం. దీనిద్వారా అధికార వ్యవస్థలో 1% మార్పు తీసుకురాగలిగినా చాలు" అని ఆయన అన్నారు. 8ని వెర్షన్‌లో పునరుద్ధరించిన '1942: ఎ లవ్ స్టోరీ' చిత్రాన్ని చూసి భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. అయితే, ఆ సినిమాను తాను ఈరోజుల్లో తీయలేనని, ఎందుకంటే తాను అప్పటి వ్యక్తిని కాదని తెలిపారు.

చోప్రాకున్న గొప్ప లక్షణం ఆయకున్న అచంచలమైన విశ్వాసమేనని జోషి అన్నారు. "వాణిజ్య పరంగా సినిమా విజయం సాధించటాన్ని ఆయన ఎప్పుడూ పట్టించుకోరు. దాని కళాత్మక గమ్యాన్ని మాత్రమే విలువైనదిగా భావిస్తారు" అని తెలిపారు. ఆ తరవాత 'పరిందా', '12బిఫ్త్ర ఫెయిల్' సినిమాల సృజనాత్మక ప్రక్రియ వైపు సంభాషణను మళ్లించారు.

సన్నాహం, ముందుచూపు, సహజ అనుకరణ గురించి చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. '1942: ఎ లవ్ స్టోరీ' చిత్రంలోని ఒక ప్రసిద్ధ షాట్ గురించి వివరిస్తూ, ప్రేక్షకులు హర్షధ్వానాలు చేస్తుండగా మనస్ఫూర్తిగా ఒక పాటను కూడా పాడారు. నిజమైన పక్షులు పర్వత శిఖరం మీదుగా ఎగురుతున్న షాట్ కోసం ఆయన ఎంత పట్టుబట్టారో చెబుతూ, దాని చిత్రీకరణకు తమ సిబ్బంది పక్షులకు దాణా చల్లిన తీరును వివరించారు. ఆ సన్నివేశాన్ని నిన్న 8ని రిజల్యూషన్‌లో చూసినప్పుడు చాలా "ఆనందాన్ని ఇచ్చింది" అని తెలిపారు.

తరువాత నవ్వులు పూయించే, హృదయానికి హత్తుకునే జ్ఞాపకాలు వరుసగా కొనసాగాయి. 'ఖామోష్' సినిమా స్క్రిప్ట్ రాసేటప్పుడు అపార్టుమెంటులోని ఒక చిన్న గదిలో ఉండేవాడినని, పైకప్పుపై డైలాగ్స్ చెబుతూ ?స్ చెబుతూ చె "కట్, కట్!" అని కేకలు వేస్తూ, ఇరుగుపొరుగు వారిని భయపెట్టేవాడినని చోప్రా గుర్తు చేసుకున్నారు. "ఒక సినిమాను ఊహించుకునేటప్పుడు విధు చిన్నపిల్ల వాడిలా ఉత్సాహంగా ఉంటాడు" అని జోషి తెలిపారు.

ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్న మరో కథను గుర్తు చేసుకుంటూ, రిహార్సల్స్ సమయంలో నటుడు జాకీ ష్రాఫ్ పొరపాటున వేరే అపార్ట్‌మెంటులోకి వెళ్లటం, అక్కడ అకస్మాత్తుగా మేల్కొన్న ఒక మహిళ కంగారు పడడం చూసి, ఆమెకు పూలు ఇవ్వటం గురించి చెప్పారు. "జాకీ ష్రాఫ్ తనని చూడటానికి వచ్చినట్టు కల వచ్చిందని ఆమె అందరికి చెప్పింది" అంటూ చోప్రా నవ్వులు పంచారు.

సంగీతం, పారవశ్యం, అద్భుతం

'1942: ఎ లవ్ స్టోరీ' గురించి మాట్లాడిన చోప్రా.. ఆర్.డి. బర్మన్ కాలం ముగిసిపోయిందని అందరూ అనుకుంటున్న సమయంలో, ఆయనతో కలిసి పనిచేయాలనుకున్నట్లు చెప్పారు. బర్మన్ మొదట ట్యూన్లను సమర్పించినప్పుడు చోప్రా వాటిని తిరస్కరించారు. "అదంతా వేస్ట్. నాకు ఎస్.డి. బర్మన్ శైలి కావాలి" అని అడిగినట్లు చెప్పారు. కొన్ని వారాల తర్వాత "కుచ్ నా కహో" పాట వచ్చింది. ఆ మెలోడీని చోప్రా వేదికపై పాడగా, ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో సందడి చేశారు. "నేను ఆ మాట అనటం వల్లే ఈ పాట రూపొందింది" అని ఆయన చమత్కరించారు.

జాతీయ అవార్డు అందుకున్న క్షణాలను చోప్రా గుర్తుచేసుకున్నారు. అవార్డుతో పాటు తనకు రూ.4,000 నగదు వస్తుందని ఆశించినా, బదులుగా ఎనిమిదేళ్ల పోస్టల్ బాండ్‌ను మాత్రమే అందుకున్నట్లు వివరించారు.

ఈ విషయంపై ఎల్.కె. అద్వాణీతో తాను చేసిన వాదనను హాస్యపూరితంగా నటించి, చూపటంతో సభ అంతా నవ్వులతో దద్దరిల్లింది. ఆ తర్వాత అద్వాణీ తనకు అందించిన సాయం, ముఖ్యంగా ఆస్కార్స్ వేడుకకు వెళ్లేందుకు చేసిన సహకారాన్ని చోప్రా గుర్తు చేసుకున్నారు.

'1942: ఎ లవ్ స్టోరీ' రచయిత్రి, చోప్రా అత్తగారు అయిన 92 ఏళ్ల కామ్నా చంద్ర, నిర్మాత యోగేష్ ఈశ్వర్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సినిమాలోని ప్రతీ డైలాగ్ కోసం తాను శ్రమించిన తీరు, పునరుద్ధరించిన చిత్రాన్ని చూసినప్పుడు భావోద్వేగానికి గురైన సందర్భాన్ని కామ్నా వివరించారు. "జీవితంలో నేను ఏదో సాధించానని అనిపించింది" అని అన్నారు.

ఇటలీలో జరిగిన 8ని పునరుద్ధరణ పనులను యోగేష్ వివరించారు. ఇందులోని ఒక్కొక్క ఫ్రేమ్‌ను జాగ్రత్తగా శుద్ధి చేసి, శబ్దాన్ని మెరుగుపరిచినట్లు చెప్పారు. "పునరుద్ధరించిన వెర్షన్, తాను ఊహించినట్లే ఉంది" అని చోప్రా తెలిపారు.

ఉల్లాసభరితమైన ప్రశ్నోత్తరాలతో ఈ సమావేశం ముగిసింది. కానీ అప్పటికే అసలైన అద్భుతం ఆవిష్కృతమైంది. దశాబ?దాల సినీ ప్రయాణాన్ని ప్రేక్షకులు వీక్షించారు. సినిమా తీయటంలో ఉండే సంతోషాలు, వింత అనుభవాలను తెలుసుకున్నారు. భారత్ లో అత్యంత ఆదరణ పొందిన కొన్ని చిత్రాలను రూపొందించిన విధు, అభిజాత్‌ల సృజనాత్మక భాగస్వామ్యాన్ని చూశారు.

దక్షిణాసియాలో అత్యంత పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలిచిన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) 1952లో ప్రారంభమైంది. దీన్ని భారత ప్రభుత్వ జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ), సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, గోవా రాష్ట్ర ప్రభుత్వ గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ (ఈఎస్‌జీ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ సినిమా రంగంలో గొప్ప శక్తికేంద్రంగా ఎదిగిన ఈ ఉత్సవంలో పునరుద్ధరించిన క్లాసిక్ చిత్రాలు.. సాహసోపేతమైన ప్రయోగ చిత్రాలు ఒకే వేదికపై నిలుస్తాయి. పౌరాణిక సినీ దిగ్గజాలు, తొలిసారి దర్శక రంగంలోకి అడుగుపెట్టిన వారు కలిసే వేదిక ఇది. ఐఎఫ్ఎఫ్ఐకి ఇంత ఆదరణ పెరగటానికి కారణం దానిలోని ఉద్వేగభరితమైన సమ్మేళనం. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్ తరగతులు, కీర్తిప్రశంసలు, అత్యంత శక్తిమంతమైన వేవ్స్ ఫిల్మ్ బజార్ లో ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలు ప్రారంభమై, వృద్ధిలోకి వస్తాయి. గోవాలోని తీర ప్రాంతంలో నవంబర్ 20 నుంచి 28 వరకు జరిగే 56వ చలనచిత్ర ఉత్సవం.. అనేక భాషలు, తరాలు, ఆవిష్కరణలు, సంగీత ప్రదర్శనల ద్వారా భారతదేశ సృజనాత్మక ప్రతిభను ప్రపంచ స్థాయిలో చాటిచెబుతుంది.

# అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ దూకుడు

**–ఏపీలో అభివృద్ధి, సంక్షేమంతో డబుల్ ఇంజిన్ సర్కార్**
**–డబుల్ ఇంజిన్ సర్కారు పనితీరు అద్భుతం**
**–మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**
**–శ్రీరాంపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**–హాజరైన కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం**

అమరావతి, నవంబర్ 24: ఏపీలో అభివృద్ధి, సంక్షేమంతో డబుల్ ఇంజిన్ సర్కార్ ముందుకు దూసుకుపోతున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండలంలోని శ్రీరాంపురంలో రూ.32 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి, రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సొసైటీ భవన నిర్మాణానికి కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంతో కలసి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం శంకుస్థాపన చేశారు. 26 మంది రైతులకు రూ.2.16 కోట్ల రుణాలను పంపిణీ చేశారు.

ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సొసైటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. శ్రీరాంపురం గ్రామంలో మంచి విలువలతో కూడిన ప్రజలతో పాటు పట్టుదల కలిగిన నాయకత్వం ఉందన్నారు. ప్రజలకు మంచి చేయాలనే తపనతో పాటు కష్టపడి సాధించే కార్యదక్షత కూడా కలిగిన ఈ నాయకత్వం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

రెడ్డిగూడెంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. కృష్ణాజలాలు మిగిలిన గ్రామాలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లకు ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు**

శంకుస్థాపన కార్యక్రమం పూర్తిగా పండుగ వాతావరణంలో సందడిగా జరిగింది. తొలుత రామాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. మహిళలు కోలాట నృత్యంతో ఆకట్టుకున్నారు. అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పంచాయతీ భవన స్థల దాతలు నాదెళ్ల చెన్నకేశవరావు, సర్పంచి అట్లూరి శ్రీనివాస రావులను, పీ.ఏ.సి.ఎస్ స్థలదాతలు వెంకట కృష్ణారావు, చంద్రశేఖర్ లను ప్రత్యేకంగా అభినందించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదిత రులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : మార్కెట్ చైర్మన్ సత్యం

నల్గొండ, నవంబర్ 24: : మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇంది రమ్మ చీరల పంపిణీని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పడుచులకు తెలంగాణ ప్రభు త్వం పెట్టిన సారెను సద్వి నియోగం చేసుకోవాలన్నారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ కుమార్, నందికొండ మట్టారెడ్డి, ఆలంపల్లి మైసయ్య, కొప్పోలు స్వర్ణలత, పోలె రవి, మేరెడ్డి వెంకట రమణ, ఆలంపల్లి ప్రసాద్, రూపని కృష్ణ, పాల్గొన్నారు.

# దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, నవంబర్ 24 : ఈ నెల 29న నిర్వహించనున్న దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతలతో సన్నాహక సమావేశ నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో నిలిచి పోయే రోజు నవంబర్ 29 అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరైందన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం మెడలు వంచిండ న్నారు. ఆ దీక్షతోటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అందుకే ఆరోజు ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అన్నారు. రాష్టానికే ఆదర్శంగా సూర్యాపేటలో దీక్షా దివస్‌ను నిర్వహించుకోనున్నట్లు తెలిపారు.

**పెద్ద ఎత్తున భూ కుంభకోణాలు**

సీఎం రేవంత్‌రెడ్డి కేవలం డబ్బు సంపాదనే రేవంత్ లక్ష్యంగా పెద్ద ఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడుతు న్నడన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు కేటాయించిన భూముల్లో ప్రభుత్వ మోసం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కోకాపేటలో ఎకరం రూ.100 కోట్ల నుండి రూ.170 కోట్లు వేలంలో విక్రయించినట్లు చెబుతున్న ప్రభుత్వం. ఇప్పుడు అదే ప్రాంతంలో అతి తక్కువ ధరకు విక్రయించడంలో అర్ధమేంటని ఆయన ప్రశ్నించారు. ప్రజాధనం దోచుకోవడంపైనే రేవంత్ సర్కార్ దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ భూముల కుంభకోణంపై వచ్చే తమ ప్రభుత్వంలో విచారణ తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను దోచుకున్న వారు ఎవరైనా వదిలిపెట్టమని, భూ కుంభకోణంలో సహకరించిన వాళ్లంతా జైలుకు వెళ్లక తప్పదన్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ చాలా గోల్ మాల్ జరుగుతుందన్నారు. ఐకెపి సెంటర్లలో సరిగ్గా ధాన్యం కొనడం లేదని, మ్యాచ్చర్ వస్తలేదని రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. దళారుల చేతుల్లో రైతులు తీవ్రంగా మోసపోతున్నారని, మళ్లీ 2014 ముందున్న సమస్యలే తలెత్తుతున్నాయన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ బీసీలను పెద్ద ఎత్తున మోసం చేసిందన్నారు. రేవంత్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చి విస్మరించి ందన్నారు. తెలిసే మోసం చేసి తప్పించుకునేందుకు సాకులు వెతుకుతుందన్నారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా ఉంది బీసీల పరిస్థితి అన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఉన్న రిజర్వేషన్లు పోగొట్టుకునే పరిస్థితి దాపురించిందన్నారు. అందుకు అనేక చోట్ల బీసీలకు జీరో రిజర్వేషన్లు రావడమే నిదర్శనం అన్నారు. బీసీల కోసం బీఆర్ఎస్ ఉద్యమిస్తదని స్పష్టం చేశారు. బీసీలతో పాటు అన్ని రంగాల ప్రజల్లో కాంగ్రెస్ పై వ్యతిరేకత పెరిగిందని తెలిపారు. కేసీఆర్‌ని వదులుకున్నామన్న భావన అందరిలో కలుగుతుందన్నారు. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ విజయకేతనం తప్పదన్నారు. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగులు లింగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ఒంటెద్దు నర్సింహా రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు పాల్గొన్నారు.

# పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పులు

## కన్న కూతురుకు పెళ్లి ఏర్పాట్లు చేస్తుండగా తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి

వికారాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పులు మోగుతున్నాయి. కన్న కూతురుకు పెళ్లి ఏర్పాట్లు చేస్తుండగా తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సగెంకుర్ధు గ్రామంలో అనంతప్ప అనే వ్యక్తి తన కూతురు అవంతి పెళ్లి ఘనంగా చేయాలనుకున్నాడు. దగ్గర బంధువుతో ఆదివారం పెళ్లి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెళ్లి పనులలో భాగంగా అనంతప్ప యాలాల్ కు వెళ్లి తిరిగి వస్తుండగా అతడి బైక్ స్కిడ్ అయ్యింది. వెంటనే అతడిని తాండూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్సని మిత్తం హైదరాబాద్ కు తరలించారు. హైదరాబాద్ లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీంతో మృతదేహాన్ని సొంతూరు తీసుకొచ్చారు. పెళ్లి కోసం వేసిన టెంట్ కిందనే తండ్రి మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సగెంకుర్ధు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# పసిబిడ్డ వైద్యానికి వెస్సో రూ.60 వేల ఆర్థిక సాయం

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్, కర్మన్ ఘాట్ కు చెందిన నారోజు శ్రీశైలం(35) అద్దె ఇంటిలో నివసిస్తూ, జీవనోపాధి గా కార్పెంటరీ పని చేస్తున్నారు. వీరికి ఇటీవల జన్మించిన బాబుకు పుట్టిన కొద్ది రోజులకే శ్వాస సంబంధిత తీవ్రమైన సమస్యలు ఎదురయ్యాయి. వెంటనే వనస్థలిపురంలోని లాలిత్య హాస్పిటల్‌లో చేర్పించగా, వైద్యులు దీనిని లారింగో మలేసియా వ్యాధి గా నిర్ధారించారు. ఈ వ్యాధిలో శ్వాసనాళం పై భాగంలోని మృదుల కణజాలం కిందికి వాలి, శ్వాసలో అడ్డంకి ఏర్పడుతుంది. వైద్యుల సలహా మేరకు, దాదాపు 4 లక్షల రూపాయల ఖర్చుతో, పెద్ద శస్త్రచికిత్స చేయించడం జరిగింది. ఈ మొత్తాన్ని వారు బంధువుల వద్ద అప్పు తీసుకుని, తమ వద్ద ఉన్న కొంత బంగారాన్ని అమ్మి సమకూర్చు కోవడం జరిగింది. అయితే, బిడ్డకి ఇంకా శ్వాసలో ఇబ్బంది కొనసాగుతున్నందున, తిరిగి పరీక్షించిన వైద్యులు, తక్షణమే మరొక శస్త్రచికిత్స అవసరం అని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స కోసం దాదాపు ?2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు.మహేశ్వరం మండలం మనుమయ సంఘం అధ్యక్షులు దంతోజు ప్రభాకరాచారి ద్వారా ఆర్థిక సహాయం అందించమని కోరుతూ పసివాడి తండ్రి శ్రీశైలం వెస్సో ట్రస్ట్ ను ఆశ్రయించారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శ్రీశైలం కు 60,600 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ నాలుగు నెలల పసి ప్రాయంలో, శ్వాసకోశ సంబంధిత వ్యాధితో జీవన్మరణ పోరాటం చేస్తున్న పసిబిడ్డ శస్త్రచికిత్స నిమిత్తం, ఆర్థిక సహాయం చేసి, ఆదుకొన్న గౌరవ దాతలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ఎస్సీ రిజర్వేషన్స్‌లో అన్యాయం




నల్గొండ, నవంబర్ 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ఏరియాల్లోని ఉప సర్పంచ్ వార్డ్ సభ్యుల రిజర్వేషన్స్ లో ఎస్సీలకు అన్యాయం చేస్తున్నాయని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోళ్ళ రాయమల్లు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీలకు వార్డ్ సభ్యుల రిజర్వేషన్స్ కేటాయించడం అనేది 2018 వరకు జరిగిందన్నారు కానీ 2018 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో ఎస్సీ వార్డ్ సభ్యుల ఎన్నికకు రిజర్వేషన్స్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలను మినహాయించి మిగతా అన్ని వర్గాల వారికి 2018 నుంచి నేటి ఎన్నికల వరకు నూతన జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్స్ కల్పిస్తున్నాయని వివరించారు.

ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీలు జన్మించడమే తప్పా అని ప్రశ్నించారు. ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీ వార్డ్స్ రిజర్వేషన్స్ తొలగించడం వలన ఉప సర్పంచ్ పదవి తమ వర్గాలకు అందకుండా పోతుందన్నారు.అనంతరం అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ మాట్లాడుతూ జనాభాలో రెండున్నర శాతం ఉన్నటువంటి అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్స్ ఇచ్చి బీసీ,ఇతర బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నటువంటి ఎస్సీ పాలకులు ఈ వచ్చే ఎన్నికల్లో ఎస్సీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక మండల ప్రెసిడెంట్ చొప్పదండి రమేష్,మండల నాయకులు తోటపల్లి మహేందర్, లింగంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నేటి అనిశ్చిత, ఘర్షణలతో కూడిన ప్రపంచంలో శ్రీ సత్యసాయి బాబా బోధనలు మరింత అవసరం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 24: ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో ఈ రోజు శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఉపరాష్ట్రపతి.. శ్రీ సత్యసాయి బాబాను శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవ విషయంలో దేవుడి ప్రతినిధిగా అభివర్ణించారు. ఆయనిచ్చిన సందేశం, సాధించిన లక్ష్యాలు.. కులం, మతం, వర్గం, జాతీయత వంటి అన్ని అడ్డంకులను అధిగమించాయని అన్నారు. 'అందరినీ ప్రేమించు, అందరికీ సేవ చేయి', 'ఎల్లప్పుడూ సహాయం చేయి, ఎప్పుడూ బాధించకు' అనే ఆయన బోధనలు ఆయన చేపట్టిన ప్రతి కార్యక్రమానికి.. ఆయన ప్రభావితం చేసిన ప్రతి జీవితాన్నీ దిశా నిర్దేశం చేశాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

ఈ సందర్భంగా కవి తిరువళ్ళువర్ రాసిన తిరుక్కురళ్‌ను ఉటంకించిన శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్.. శ్రీ సత్యసాయి బాబా జీవితం మొత్తాన్నీ మానవాళిని ప్రేమించేందుకు, సేవ చేయడానికి అంకితం చేయడం ద్వారా ఈ శాశ్వతమైన సత్యాన్ని నిరూపించారని పేర్కొన్నారు.

సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసల గురించి చెప్పే బాబా బోధనలను ప్రధానంగా పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. సామరస్యపూర్వకమైన, ప్రగతిశీల సమాజాన్ని తయారుచేసేందుకు ఈ శాశ్వత విలువలు అవసరమని అన్నారు.

నేటి ప్రపంచంలో 'అసమ్మతి బదులు సామరస్యం, స్వార్థం స్థానంలో త్యాగాన్ని నింపాలి' అని మానవాళిని కోరే బాబా సందేశాన్ని ఉపరాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. అనిశ్చితి, సంఘర్షణలతో కూడిన నేటి ప్రపంచంలో ఈ విలువలు సందర్భోచితంగా ఉన్నాయని ఆయన అన్నారు.

శ్రీ సత్యసాయి బాబా చెప్పినట్లుగా ప్రజా జీవితం కూడా సత్యం, ధర్మం, సానుభూతి, నైతిక బాధ్యత వంటి సద్గుణాల ద్వారా మార్గనిర్దేశం కావాలని ఆయన ప్రధానంగా చెప్పారు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు గురించి చెబుతూ ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక సంక్షేమంలో చేపట్టిన విస్తృతమైన కార్యక్రమాలను శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ ప్రశంసించారు. ట్రస్టు చేపట్టిన మొబైల్ గ్రామీణ ఆరోగ్య సేవలు మారుమూల ప్రాంతాల ప్రజలకు ముఖ్యమైన జీవనాధారంగా ఉన్నాయని కొనియాడారు. ప్రపంచ స్థాయి ప్రమాణాల ప్రకారం విలువలతో కూడిన ఉచిత విద్యను అందిస్తున్న ట్రస్టు విద్యా సంస్థలను ఆయన మెచ్చుకున్నారు.

తాగునీటి ప్రాజెక్టులు, విపత్తుల విషయంలో సహాయం, అనేక మానవతా సేవలు ద్వారా ప్రజలను పురోగతి బాట పట్టిస్తూనే ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. చెన్నై నగరానికి తాగునీటి సరఫరాను అందించే తెలుగు గంగ కాలువను పునరుజ్జీవింపజేయడంలో శ్రీ సత్యసాయి బాబా అందించిన కీలక సహకారాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. తమిళనాడు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక సేవా కార్యంగా దీనిని వర్ణించారు. సేవ ద్వారా నెలకొనే ప్రేమ సమాజాన్ని ఏ విధంగా మార్చగలదన్న విషయంలో ఈ కార్యక్రమాలు శాశ్వత ఉదాహరణలుగా నిలుస్తాయని ఆయన అన్నారు.

అవసరమైన వారికి సహాయం అందించడంతో పాటు కుటుంబాలు, సమాజాలు, దేశంలో శాంతిని పెంపొందించడం ద్వారా బాబా వారసత్వాన్ని ఆచరణాత్మకంగా గౌరవించాలని భక్తులు, ప్రజలందరికీ ఉపరాష్ట్రపతి విన్నవించారు. సమస్త సాయి సమాజానికి ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు తెలియజేశారు. 'సమస్త లోకాః సుఖినో భవంతు' అనే శ్రీ సత్యసాయి బాబా సూత్రాన్ని ఆయన ఉటంకించారు. 'సేవే గొప్ప ఆరాధన, ప్రేమే గొప్ప నైవేద్యం' అని మనకు తెలియజేసే శ్రీ సత్యసాయి బాబా బోధనలు మానవాళి మార్గాన్ని ప్రకాశవంతం చేస్తూనే ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు.

శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనను ఉపరాష్ట్రపతి కూడా తిలకించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, త్రిపుర గవర్నర్ శ్రీ ఎన్. ఇంద్రసేన రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ- ఎలక్ట్రానిక్స్ - కమ్యూనికేషన్- ఆర్టీజీ మంత్రి శ్రీ నారా లోకేష్, తమిళనాడు మంత్రి - శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీ శేఖర్ బాబు, శ్రీ సత్యసాయి సేవా సంస్థ అఖిల భారత అధ్యక్షుడు శ్రీ ఆర్.జె. రత్నాకర్, శ్రీ సత్య సాయి హయ్యార్ లెర్నింగ్ ఇనిస్టిట్యూట్ ఛాన్సలర్ శ్రీ నిమిష్ పాండ్య.. శ్రీ కే. చక్రవర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.




# మహబూబాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులు చిచ్చు

## –డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య నాయకుడు దొంతు యాదగిరి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

మహబూబాబాద్, నవంబరు 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులు చిచ్చు రేపాయి. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడుతూ అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకులను కాదని తిరిగి ఎమ్మెల్యే భార్యకే అధ్యక్ష పదవి కట్టబెట్టడంపై రాజీనామాల పర్వం మొదలైంది. టిపిసిసి మాజీ అధికార ప్రతినిధి, డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య నాయకుడు దొంతు యాదగిరి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న నాయకులను కాదని తిరిగి ఎమ్మెల్యే సతీమణికే ఎలా జిల్లా అధ్యక్ష పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం ఉండదని నేను వ్యక్తిగతంగా భావిస్తూ తన సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, జిల్లా అధ్యక్ష పదవి ఎమ్మెల్యే సతీమణి ఉమకే రావడం మరికొంతమంది నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# మెట్రో పిల్లర్‌ను ఢీకొని ఇద్దరు స్నేహితులు అక్కడిక్కడే మృతి

హైదరాబాద్ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ ( పిల్లర్ నెం. 1618 వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు స్నేహితులు అక్కడిక్కడే మృతి చెందారు. అతివేగంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వీరు నియంత్రణ కోల్పోయి మెట్రో పిల్లర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నగర వాసులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతులు మధు, హరీష్ గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# ఖమ్మంలో ఎన్టిఆర్ విగ్రహావిష్కరణలో తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు

ఖమ్మం నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఇంత అవినీతి మయమైన రాజకీయాల్లో..ఇంత కళంకమైన కుచ్చితమైన రాజకీయాల్లో రాణిస్తున్నా నంటే..అది దివంగత మాజీ సిఎం ఎన్టిఆర్ చలువే అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. ఎన్టిఆర్ శిష్యుడు ఎవరు అంటే తుమ్మల అనే పేరు తెచ్చుకున్నానని అన్నారు. ఖమ్మంలో ఎన్టిఆర్ విగ్రహావిష్కరణలో తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 1983 నుంచి నేటి వరకు ఎన్టిఆర్ అడుగుజాడల్లో నడుస్తున్నానని, రాముడి పాదాల దగ్గర.. పార్టీలో ఎన్టిఆర్ చేర్చుకున్నారని తెలియజేశారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేయడం నేర్చుకున్నానని, ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నానని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు

# మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే వేముల వీరేశం




నల్గొండ, నవంబర్ 24:రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కట్టంగూర్ తాసీల్దార్ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ఆడ బిడ్డలకు ప్రభుత్వ సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ యారాల అశోక్ రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞాన ప్రకాశ్ రావు, డిప్యూటీ తాసీల్దార్ అల్బట్ ఫ్రాంక్లిన్, ఏపీఎం రాములు, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బండారు కృష్ణ, గుండు పరమేశ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య పాల్గొన్నారు.

# ఈదులూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు పంపిణీ

నల్గొండ, నవంబర్ 24: కట్టంగూర్ మండలంలోని ఈదులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో చిక్కు రంగయ్య జ్ఞాపకార్థం 4 సైకిళ్లను, 70 బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఆర్ఓ ప్లాంట్ ద్వారా మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, మాజీ ఎంపీటీసీ తవిడబోయిన భవాని, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, కల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, ట్రెజరర్ పోగుల రాములు, క్లబ్ సభ్యులు తవిడ బోయిన నరసయ్య, గోశిక ఉమాపతి, బొడ్డుపల్లి వెంకన్న, బజ్జూరి యాదయ్య, మంగదుడ్ల శ్రీనివాస్, జిల్లా ఉపేందర్, చిక్కు విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులకు మినహాయింపు లేదు : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్గొండ, నవంబర్ 24: ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులకు మినహాయింపు ఉండదని, ఒకవేళ అత్యవసరమైతే ముందుగానే అనుమతి తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి నిర్దేశించిన సమయంలోగా హాజరు కావాలని ఆదేశించారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాల యాలను తాను ర్యాండంగా తనిఖీ చేయనున్నట్లు చెప్పారు.

అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికలను మండల ప్రత్యేక అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పర్యవేక్షించాలని, అవసరమైతే ఎంపీడీఓ కార్యాలయంలో కూర్చొని ఎన్నికలు సవ్యంగా జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

